Prajalakshyam Telugu Daily
# ప్రజాలక్ష్యం
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి
సంపుటి: 16 | సంచిక: 364 | కరీంనగర్ | ఆదివారం 24 మే 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## మాసాబ్ ట్యాంక్‌లో దారుణ ఘటన

**- న్యాయవాదిని కారుతో ఢీకొట్టి చంపిన దుండుగుల**

**- కారు నంబర్ ఆధారంగా పోలీసుల దర్యాప్తు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 23 : హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ ప్రాంతంలో న్యాయవాది ఖాజా మొహియుద్దీన్‌పై ప్రత్యర్థులు దాడికి తెగబడ్డారు. శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చిన న్యాయవాదిని దుండగులు కారుతో బలంగా ఢీకొట్టారు. పక్కా ప్లాన్‌తో న్యాయవాది కోసం

11 లో

## బక్రీద్ సెలవు 28కి మార్పు

**ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 24 : తెలుగు రాష్ట్రాల్లో బక్రీద్(ఈద్ అల్-అధా) పండుగ తేదీ మారింది. దుల్ హిజ్జా నెలవంక దర్శనం ఆలస్యం కావడంతో మే 28న బక్రీద్ సెలవు దినంగా ప్రకటిస్తూ ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీచేశాయి. దీంతో ఆ రోజున అన్ని ప్రభుత్వ కార్యాల యాలు సహా విద్యాసంస్థలు, బ్యాంకులకు సెలవు ఉండనుంది. అయితే.. చంద్రుని దర్శనం ఆధారంగా సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్

11 లో

# రెండో విడతలో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ళు

**- ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పున మంజూరు**

**- పాత ఇందిరమ్మ ఇళ్ల పూర్తికి నిధులు కేటాయింపు**

**- జూన్ 1న కొరారి గ్రామంలో ఆదివాసీల ఇందిరమ్మ కాలనీ ప్రారంభం**

**- కేబినెట్ నిర్ణయాలను వివరించిన మంత్రి పొంగులేటి**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 24 : రాష్ట్రంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 2 లక్షల 50 వేల మంది పేద కుటుంబాల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పున ఇళ్లను మంజూరు చేయాలని నిర్ణయించింది. కేబినేట్ వివరాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ కుమార్‌లు మీడియాకు వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించి గోడలు, శ్లాబు దశలో నిలిచిపోయిన వాటిని కూడా పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. పునాదులు పూర్తయి గోడలు, శ్లాబు పడని ఇళ్లకు రూ.3 లక్షలు, గోడలు పూర్తయి శ్లాబు నిలిచిపోయిన ఇళ్లకు రూ.2 లక్షలు చొప్పున అందిస్తాం. అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసేందుకు నియోజకవర్గానికి 500 ఇళ్లకు చొప్పున నిధులు కేటాయిస్తూ క్యాబినెట్ తీర్మానించింది. తొలి విడతలో నిర్మాణం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్లలో జూన్ రెండు నాటికి దాదాపు లక్ష ఇళ్ల గృహ ప్రవేశాలు జరుగుతాయి. కుమురం భీం

11 లో





# యాదగిరి గుట్టలో సిఎం పర్యటన

**- వందకోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**- రూ.43.80 కోట్లతో వేదపాఠశాలకు భూమిపూజ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మే 23 : యాదగిరిగుట్టలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. శనివారం ఉదయం యాదగిరిగుట్టకు చేరుకున్న సీఎం రేవంత్ శ్రీలక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రూ.43.80 కోట్లతో నిర్మించనున్న వేద పాఠశాలకు రేవంత్ శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతితో కలిసి వేదపాఠశాలకు భూమిపూజ చేశారు. అనంతరం రూ.9.87 కోట్లతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణానికి, రూ.1.41 కోట్లతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గంపై కప్పు నిర్మాణానికి, రూ.1.35 కోట్లతో నిర్మించనున్న రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణానికి, రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదన్ నిర్మాణానికి ముఖ్యమంత్రి

11 లో

## భద్రత, వాణిజ్య,సాంకేతిక రంగాల్లో సహకారం

**- అమెరికాకు భారత్ కీలక భాగస్వామి**

**- ప్రధాని మోడీతో అమెరికా విదేశాంగ మంత్రి రూబియో చర్చలు**



న్యూఢిల్లీ, మే 24 : భద్రత, వాణిజ్యం, సాంకేతిక రంగాలలో అమెరికా-భారత్ సహకారాన్ని మరింతగా పెంపొందించే మార్గాలపై ప్రధాని మోదీతో చర్చించినట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్కొన్నారు. తమ దేశానికి భారత్ ఓ కీలక భాగస్వామి అన్నారు. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలపడుతున్నాయని.. భారతీయ కంపెనీలు తమ దేశంలో 20 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయని తెలిపారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న

11 లో

## బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు..

**-ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు**

**-హరీష్ వ్యాఖ్యలపై పొంగులేటి కౌంటర్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 23 : బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు' అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. లాగే మాజీమంత్రి హరీశ్‌రావుపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా నుంచి ఫ్యూచర్ సిటీని ఆపేస్తామంటూ హరీశ్‌రావు ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పొంగులేటి పోస్టు పెట్టారు. బీఆర్ఎస్‌లో హరీశ్‌రావు ఫ్యూచర్ ఏంటో ఆయనకే తెలియదు అంటూ కౌంటర్ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీ భూములపై అమెరికాలో ఎవరికైనా ఒప్పందాలు చేసుకున్నారా..? అంటూ నిలదీశారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఒక్క మెట్రోస్టేషన్

11 లో

## గోదావరి పుష్కరాలకు వేయికోట్లు



**- జూనియర్ కాలేజీల్లో మహద్యాహ్న భోజనం - గంగాధర కాలేజీలో పోస్టుల భర్తీకి ఆమోదం - కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరు - తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 24 : వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో... సంబంధిత పనులకు రూ.వెయ్యి కోట్ల కేటాయిస్తూ తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరుకు పచ్చజెండా ఊపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో

11 లో

## హరీష్ రావువి పగటి కలలు

**- అధికారంలోకి రావడం కల్ల - ఫ్యూచటర్ సిటీపై బాధ్యాతారాహిత్య ప్రకటన - అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా బిఆర్ఎస్ - మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 24 : ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. ఇది బ్లాక్ మెయిల్ రాజకీయమని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలా? వద్దా? ఆయన చెప్పాలన్నారు. 'ఇలా చేస్తే పెట్టుబడులు రావు. పక్క రాష్ట్రాలకు వెళ్తాయి. ఫ్యూచర్ సిటీలో కాలుష్యకారక పరిశ్రమలు ఉండవు. దాన్ని రద్దు చేస్తామనడం ఎంత వరకు సమంజసం అని

11 లో



## వ్యాపార ఎదుగుదలకు తోడ్పడాలి

**చార్టెడ్ అకౌంటెంట్లకు కెటిఆర్ హితవు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 24 :చార్టర్డ్ అకౌంటెంట్లు కేవలం పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. వ్యాపారాలను వృద్ధి చేసే సలహా దారులుగానూ ఎదగాలని ఆకాంక్షించారు. కృత్రిమ మేధను తమ వృత్తిలో భాగం చేసుకోవాలన్నారు. గచ్చిబౌలిలో 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌం టెంట్స్ ఆఫ్ ఇండియా' స్నాతకోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భవిష్య త్తులో వ్యాపార అవకాశాల్లో సీఏల పాత్ర అత్యంత కీలకమని.. ట్యాక్స్‌లు, జీఎస్టీ, వ్యాపారాల

11 లో



## యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

**- దేశవ్యాప్తంగా రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి ఉద్యోగాలు**

**- ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు**

**- 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్ మే 24 : దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో జరిగిన రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. యువత స్వయం సమృద్ధి సాధించి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. శనివారం నాడు బోయిగూడలోని రైల్ కళారంగ్‌లో జరిగిన 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈరోజు 220 మంది కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్నారన్నారు. 2022లో దీపావళి రోజున మొదలైన రోజ్‌గార్ మేళా ద్వారా ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. ఇది కేవలం ఉద్యోగాల కార్యక్రమం కాదని, యువత భవిష్యత్తు కోసం మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన పెద్ద మిషన్ అని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ కంపెనీల్లో కూడా కోట్ల సంఖ్యలో ఉద్యోగాలు వస్తున్నాయని అన్నారు. స్టార్టప్స్, యూనికార్న్ వల్ల యువత ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి వచ్చిందని కేంద్రమంత్రి అన్నారు. రోడ్లు, ఎయిర్‌పోర్టులు, రైల్వేలు, మెట్రోలు, ఇండస్ట్రియల్ కారిడార్లు వంటి ప్రాజెక్టులతో భారీగా ఉపాధి పెరుగుతోందన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం రూ.12 లక్షల కోట్ల ఇన్‌ఫ్రా పనులు జరుగుతున్నాయని వివరించారు. ప్రతి లక్ష కోట్ల పెట్టుబడికి 14 నుంచి 15 లక్షల ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. యువతను మోదీ 'వికసిత భారతానికి సూపర్ హీరోలు'గా చూస్తున్నారని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా కోట్ల మంది యువతకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. గ్రామీణ యువతకు కూడా ఏఐ, ఎఐ వంటి ఆధునిక టెక్నాలజీని

11 లో

## తెలంగాణ ఎండల తీవ్రతపై ప్రభుత్వం అలర్ట్



**- వడదెబ్బకు 16 మంది మృతి చెందినట్లు గుర్తింపు**

**- మృతుల కుటుంబాలకు 4లక్షల చొప్పన పరిహారం**

**- పరిస్థితిపై అధికారులతో మంత్రి పొంగులేటీ సమీక్ష**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 23 : రాష్ట్రవ్యాప్తంగా హీట్ వేవ్‌పై హై అలర్ట్ ప్రకటించినట్లు తెలంగాణ రెవెన్యూ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తీవ్ర ఉష్ణోగ్రతలపై మంత్రి పొంగులేటి సచివాలయంలో శనివారం అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. వడగాల్పులతో 7 జిల్లాల్లో 16 మంది మృతిచెందారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో నష్టపరిహారం ఇస్తున్నామని స్పష్టం చేశారు. వచ్చే మూడు రోజులు మరింత తీవ్రంగా హీట్ వేవ్ ఉండనుందని తెలిపారు. జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశర చేశారు. ప్రజల ప్రాణ రక్షణెళి తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని తెలిపారు. వడగాల్పులతో ఒక్క ప్రాణం కూడా కోల్పోకూడదని చెప్పుకొచ్చారు. ఎండ తీవ్రతపై ప్రజలకు గంట గంటకు హెచ్చరికలు జారీ చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల

11 లో

## ధాన్యం కొనుగోళ్లలో పూర్తి నిర్లక్ష్యం

**- రైతుల అగచాట్లు పట్టని ప్రభుత్వం**

**- మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిజామాబాద్, మే 23 : పంట కొనుగోలులో దారుణంగా విఫలమైన ప్రభుత్వం అన్నదాతల ఆత్మహత్యలపై తప్పుడు లెక్కలు చెప్తున్నదని మాజీమంత్రి వేములు

11 లో

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో ఉండాలి

**- మొక్కజొన్న నిల్వలను వెంటనే గోదాములకు తరలించాలి - భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశాలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం, మే 23 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం సహించబోమని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న మొక్కజొన్నను వెంటనే గోదాములకు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. కొనుగోలు, నిల్వ, లోడింగ్, రవాణా ప్రక్రియలను పరిశీలించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం కేంద్రంలో 117 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న నిల్వ ఉన్నట్లు అధికారులు తెలియజేయగా, నిల్వలు ఎక్కువకాలం కేంద్రంలో ఉండకుండా వెంటనే గోదాములకు తరలించాలని ఆదేశించారు. రైతులు తీసుకొస్తున్న మొక్కజొన్నను సకాలంలో కొనుగోలు చేసి లోడింగ్ పనులు వేగవంతం చేయాలని సూచించారు. రవాణా వాహనాలు, హమాలీల లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని, లారీల కొరత లేదా హమాలీల సమస్యలతో తరలింపు ప్రక్రియలో జాప్యం జరగకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులకు సూచించారు. అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని నిల్వ ఉన్న మొక్కజొన్న తడవకుండా రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. రైతులకు తాగునీరు, నీడ, కూర్చునే సదుపాయాలు కల్పించి, కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ఆళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో సిబ్బంది హాజరు, వైద్య సేవల నిర్వహణ, రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. తనిఖీల సమయంలో వైద్య అధికారి తరుణ్



అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేసి వివరణ కోరారు. సంబంధిత శాఖ అధికారులు పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అవుట్ పేషెంట్ విభాగం, పరీక్షల గది, మందుల నిల్వ గది, ఇన్ పేషెంట్ విభాగాలను పరిశీలించిన కలెక్టర్ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. వడదెబ్బతో చికిత్స పొందుతున్న రోగులకు ప్రత్యేక వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు, ద్రవాలు, పడకలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ ఉషారాణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన జీవితానికి క్రీడలు ఎంతో అవసరం

**- కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వస్తేనే విజయాలు సాధ్యం : జిల్లా కలెక్టర్**

**- జాబ్‌మేళాలో ఎంపికైన 618 మందికి నియామక పత్రాల అందజేత**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 23 : ఆరోగ్యకరమైన జీవితానికి క్రీడలు ఎంతో అవసరమని, యువత తమ కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి కష్టపడి పనిచేస్తేనే జీవితంలో ఉన్నత విజయాలు సాధించగలరని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యువజన, క్రీడల అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా "ఉద్యోగ సాధన-ప్రతిభకు అవకాశాల అనుసంధానం" పేరుతో నిర్వహించిన ఉద్యోగ మేళాలో ఎంపికైన 618 మంది అభ్యర్థులకు తాత్కాలిక నియామక పత్రాలను అందజేశారు. అలాగే సీఎం కప్-2026 రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన 72 మంది యువ క్రీడాకారులను సన్మానించారు. జిల్లాకు చెందిన మొత్తం 433 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పతకాలు సాధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గతంలో కుటుంబాల్లో క్రీడలకు పెద్దగా ప్రోత్సాహం ఉండేది కాదని, ప్రస్తుతం సానియా మీర్జా, తిలక్ వర్మ వంటి క్రీడాకారులు యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. క్రికెట్‌తో పాటు ఇతర క్రీడల్లోనూ భారత యువత ప్రతిభ చాటుతోందని, ఒలింపిక్స్‌లో అథ్లెటిక్స్ విభాగంలో భారత క్రీడాకారులు పతకాలు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రపంచం వేగంగా మారుతోందని, సంపద కంటే ఆరోగ్యం ముఖ్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రీడలు ఎంతో అవసరమని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కూడా క్రీడలు అందిస్తాయని చెప్పారు. ఖమ్మం జిల్లా క్రీడల్లో ఎప్పుడూ ముందంజలో ఉంటుందని, ఇక్కడ




మంచి మౌలిక సదుపాయాలు, శిక్షకులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. క్రీడాకారులు శరీరాన్ని దేవాలయంలా భావించి సరైన పోషకాహారం తీసుకోవాలని, గాయాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రతి ఒక్కరిలో ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, దానిని గుర్తించి పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని యువతకు సూచించారు. ఉద్యోగం సాధించడం మొదటి అడుగు మాత్రమేనని, పట్టుదలతో పనిచేస్తే మరింత ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ప్రోత్సహించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ, ఉద్యోగ మేళాలో ఎంపికైన యువతకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి విజయం జీవితంలో మరిన్ని విజయాలకు ప్రేరణ కావాలని ఆకాంక్షించారు. జిల్లా యువజన, క్రీడల అధికారి సునీల్ రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి ఎన్.మాధవి, శిక్షకులు, క్రీడాకారులు, విద్యార్థులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గత రెండు వేజ్‌బోర్డులలో జరిగిన నష్టాన్ని 12వ వేజ్‌బోర్డు ద్వారా భర్తీ చేయాలి



**- కార్మికులకు నష్టం కలగకుండా జాతీయ కార్మిక సంఘాలు చర్యలు తీసుకోవాలి**

**- టీబీజీకేఎస్ ఉపాధ్యక్షులు ఆయిలి శ్రీనివాస్ డిమాండ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని, మే 23 : గత రెండు వేజ్ బోర్డులలో బొగ్గుగని కార్మికులకు జరిగిన ఆర్థిక నష్టాన్ని 12వ వేజ్ బోర్డు ద్వారా భర్తీ చేసే విధంగా జాతీయ కార్మిక సంఘాలు చర్యలు చేపట్టాలని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు ఆయిలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం వకీల్‌పల్లి గనిని సందర్శించిన సందర్భంగా కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 11వ వేజ్ బోర్డు కాలపరిమితి ముగిసే సమయం దగ్గరపడుతున్నప్పటికీ, 12వ వేజ్ బోర్డు ముసాయిదా ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వాన్ని కోరడంలో జాతీయ కార్మిక సంఘాలు విఫలమయ్యాయని విమర్శించారు. గత రెండు వేజ్ బోర్డులలో కార్మికులకు నష్టదాయకమైన అనేక నిర్ణయాలకు జాతీయ కార్మిక సంఘాలు అంగీకరించాయని ఆరోపించారు. భూగర్భ గనుల భత్యాన్ని 12.5 శాతం నుంచి 9 శాతానికి తగ్గించడం, భత్యాలను స్థిరీకరించడం వల్ల కార్మికులకు భారీ నష్టం జరిగిందన్నారు. అలాగే ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి పెన్షన్ సమీక్షించి పెంచే అవకాశం ఉన్నప్పటికీ గత 28 సంవత్సరాలుగా పెన్షన్ పెంపు చేపట్టలేదని విమర్శించారు. పెన్షన్‌లో అదనపు భత్యం మినహాయించడం, సీపీఆర్ఎంఎస్ పేరిట పదవీ విరమణ సమయంలో భారీ మొత్తాలు వసూలు చేయడం వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. గత వేజ్ బోర్డుల ఒప్పందాల కారణంగా ప్రతి కార్మికుడికి నెలకు రూ.4 వేల నుంచి రూ.8 వేల వరకు నష్టం జరుగుతోందని అన్నారు. పదోన్నతులు, సంక్షేమ పథకాలు, ఇతర హక్కులకు సంబంధించిన అంశాలపై సంయుక్త సంప్రదింపుల కమిటీల్లో సరైన నిర్ణయాలు తీసుకోకపోవడం వల్ల కార్మికుల ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా 12వ వేజ్ బోర్డులో కార్మికులకు నష్టం జరగకుండా 35 శాతం సరిపోలిక ప్రయోజనం కల్పించాలని, భత్యాల స్థిరీకరణ లేకుండా చూడాలని జాతీయ కార్మిక సంఘాలను కోరారు. అన్ని సంఘాలు కలిసికట్టుగా కనీస ఉమ్మడి ముసాయిదాను బొగ్గుగని యాజమాన్యానికి సమర్పించాలని సూచించారు. అదేవిధంగా పదోన్నతి విధానాలు, సంక్షేమ సదుపాయాలు, సొంతింటి పథకం వంటి అంశాలను కూడా 12వ వేజ్ బోర్డులో ప్రస్తావించాలని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం తరఫున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరి ప్రసాద్, వెంకటేష్, రవితేజ, నరేష్, రాజు, అరవింద్, రామ్‌చరణ్, శ్రీనివాస్, గంగాధర్, రంజిత్, రమేష్, జీవన్, వినోద్, సంజీవ్, చాణక్య, శ్రీధర్, అనిల్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# నీటిపారుదల శాఖపై ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆగ్రహం

**"నిద్రావస్థ వీడి పనిచేయండి... లేదంటే చర్యలు తప్పవు"**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే, 23 : వనపర్తి నియోజకవర్గంలో నీటిపారుదల శాఖ అధికారులు నిద్రావస్థ నుంచి బయటకు రావాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కెనాల్ల నిర్మాణం, పూడికతీత పనులు, భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం, ఫీడర్ ఛానళ్లు, రిజర్వాయర్ల అభివృద్ధి, ఆయకట్టు ప్రాంతాలకు సాగునీటి సరఫరా, కెనాల్లపై ఉన్న రెగ్యులేటర్ల పునరుద్ధరణ, బుద్ధారం--పెద్దమందడి కెనాల్ల బలోపేతం, చెక్ డ్యాములు, లింకు కెనాల్లు వంటి అనేక అంశాలపై సమీక్ష నిర్వహించారు. అలాగే నల్లచెరువు నుంచి అమ్మ చెరువు వరకు ఫీడర్ ఛానల్, మర్రికుంట నుంచి అమ్మ చెరువు వరకు కాలువ నిర్మాణం, ఘనప సముద్రం రిజర్వాయర్ నిర్మాణ పనులు, పెబ్బేరు మినీ ట్యాంక్ బండ్, చిట్యాల-తాడిపత్రి ఫీడర్ ఛానల్ బలోపేతం, పూసల చెరువు, గొల్లపల్లి రిజర్వాయర్, పోల్కేపహాడ్ రిజర్వాయర్, కాశీనగర్ రిజర్వాయర్ తదితర ప్రాజెక్టుల పురోగతిపై అధికారులను ప్రశ్నించారు. తలుపునూరు గ్రామానికి చెందిన 2000 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించే అంశంపై ప్రత్యేకంగా చర్చించిన ఎమ్మెల్యే, పెద్దమందడి మండలంలో కెనాల్ల బలోపేతం, ఘనపసముద్రం చెక్ డ్యామ్ ఫీడర్ ఛానల్ పునరుద్ధరణ, రంగన సముద్రం అలుగు బలోపేతం, వనవిండి వాడ రిజర్వాయర్ విస్తరణ, భీమా 15 ప్యాకేజ్ విస్తరణ పనులు వేగవంతం



చేయాలని ఆదేశించారు. కాన్ చెరువుకు నీటి సరఫరా, గట్ల కానాపురం-గొల్లపల్లి-ఏదుట్ల లింకు కెనాల్ ఏర్పాటు, అమ్మ చెరువు-నల్లచెరువు ఫీడర్ ఛానల్, మర్రికుంట-అమ్మ చెరువు కాలువ పనులపై కూడా అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. వేసవికాలంలో చేపట్టాల్సిన పనుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకొని యువత ముందుకు సాగాలి

**- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**

**- 105 మంది యువతకు నియామక పత్రాల అందజేత**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం, మే 23 : ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగడంతో పాటు స్వయం సమృద్ధి సాధించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. యువత అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి బలమైన పునాది అని అన్నారు. 99 రోజుల పాలన-ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహించిన యువజనోత్సవ వారోత్సవాల ముగింపు కార్యక్రమం శనివారం ఐడీఓసీ కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్ పలు కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గత నెల 4వ తేదీన ఖమ్మంలో నిర్వహించిన భారీ ఉద్యోగ మేళాలో ఉద్యోగాలు సాధించిన 105 మంది యువతీ యువకులకు కలెక్టర్ తాత్కాలిక నియామక పత్రాలను అందజేశారు. యువత ఉపాధి అవకాశాలను వినియోగించుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం సీఎం కప్-2026తో పాటు ఇతర




క్రీడా పోటీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు, వేసవి శిక్షణ శిబిరాల్లో విశేష ప్రతిభ ప్రదర్శించిన యువతకు మెడల్స్ ప్రదానం చేసి అభినందించారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో జిల్లా యువత ప్రతిభ చాటుకోవడం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పర్యాటక శాఖ రూపొందించిన "తెలంగాణ పర్యాటక గుర్తింపు కిట్-తెలంగాణ తప్పక రండి"ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక, పర్యాటక విశేషాలను ప్రజలకు చేరువ చేయడంలో ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "మ్యూజియాలజీ ధ్రువపత్ర కోర్సు", "పురావస్తు శాస్త్ర ధ్రువపత్ర కోర్సు"ల గురించి వివరించారు. పర్యాటక రంగంపై ఆసక్తి ఉన్న యువత ఈ అవకాశాలను వినియోగించుకొని ఉపాధి అవకాశాలు పొందవచ్చని సూచించారు.




# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**కలెక్టర్ చిత్రా మిశ్రా**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, మే 23 : జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసి సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని, తాగునీటి సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న అభివృద్ధి పనులు, ఐకేపీ వీవో భవనాలు, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, తాగునీటి సమస్యల నివారణ చర్యలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఐకేపీ ఏపీఎంలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ఏఈలు, డీఈలు, ఈఈలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో పాఠశాలల్లో చేపడుతున్న టాయిలెట్ల నిర్మాణం, కిచెన్ షెడ్లు, కాంపౌండ్ వాల్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఇంకా ప్రారంభం కాని పనులను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యానికి తావులేకుండా పనిచేయాలని స్పష్టం చేశారు. ఐకేపీ వీవో భవనాలు, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించిన కలెక్టర్, జూన్ 2 తర్వాత ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరు ప్రక్రియపై ప్రభుత్వం దృష్టి పెట్టనున్న నేపథ్యంలో జిల్లాలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని రకాల పెన్షన్లకు సంబంధించిన కేవైసీ అప్‌డేట్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతర అభివృద్ధి పనులపై అధికారులు ప్రత్యేక ఫోకస్ పెట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఇన్‌చార్జి జెడ్పీ సీఈవో పవన్ కుమార్, డీఆర్‌డీఓ గీత, డీపీవో జగదీశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



# మహిళా వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్ చిత్రా మిశ్రా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, మే 23 : ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మే 25 నుంచి 30 వరకు నిర్వహించనున్న మహిళా వారోత్సవాలను సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం మహిళా, శిశు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, మెప్మా శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. మే 25న పోషకాహార మిషన్ కార్యక్రమంలో భాగంగా పోషకాహార వంటకాల ప్రదర్శనలు, జంక్ ఫుడ్‌కు వ్యతిరేక అవగాహన, వంటల పోటీలు, గర్భిణీలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాలు, వార్డుల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన సమావేశాలు నిర్వహించాలని సూచించారు. మే 26న 'బాల్య వివాహం-బతుకు ఆగం' పేరుతో బాల్య వివాహాల నిర్మూలనపై పోస్టర్లు, పాంప్లెట్లు, గోడచిత్రాల ద్వారా ప్రచారం చేపట్టనున్నట్లు వెల్లడించారు. బాల్య వివాహాలు అధికంగా జరిగే గ్రామాల్లో మత పెద్దలు, కళ్యాణ మండప నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించి 1098, 181 సేవలపై ప్రచారం చేయాలని ఆదేశించారు. మే 27న మహిళల భద్రత, షీ టీమ్స్ సమన్వయం, కార్యాలయాల్లో పోష్ నిబంధనల అమలుపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులకు లోన్ మేళా నిర్వహించాలని తెలిపారు. మే 29న కొత్త అంగన్‌వాడీ కేంద్రాలు, వీఓ భవనాలు ప్రారంభించడంతో పాటు మెప్మా ఆధ్వర్యంలో వేములవాడలో క్యాంటీన్ ప్రారంభించాలని సూచించారు. మే 30న 'అమ్మ మాట-అంగన్‌వాడి బాట' కార్యక్రమం నిర్వహించి ఐదేళ్లు నిండిన పిల్లలకు ప్రాథమిక పాఠశాల ప్రవేశ సర్టిఫికెట్లు అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, మెప్మా పీడీ స్వరూపరాణి, డీఆర్‌డీఏ పీడీ గీత, డీపీఓ జగదీశ్వరరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# అనుమతి లేని సీసీ కెమెరాల తొలగింపు

**28వ వార్డు ప్రజల ఫిర్యాదుకు స్పందించిన కౌన్సిలర్ ఒగ్గు రమేష్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




జమ్మికుంట మే 23 : జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డులో ప్రైవేటు వ్యక్తులు రోడ్లకు ఇరువైపులా దాదాపు 12 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంపై స్థానిక ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కెమెరాల ద్వారా వార్డులోని ప్రజల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ వారి వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తున్నారని, ప్రజల మనోభావాలు దెబ్బతింటున్నాయని వార్డు ప్రజలు కౌన్సిలర్ ఒగ్గు రమేష్‌కు ఫిర్యాదు చేశారు. ప్రజల ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకున్న కౌన్సిలర్ ఒగ్గు రమేష్, వార్డు సభ్యుల కోరిక మేరకు మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి శుక్రవారం ఆ ప్రైవేటు వ్యక్తి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను తొలగించే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఒగ్గు రమేష్ మాట్లాడుతూ, సీసీ కెమెరాలు ప్రజల భద్రతకు, నేరాల నివారణకు ఉపయోగపడే విధంగా ఉండాలని, అయితే ప్రజల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే విధంగా వాటిని వినియోగించడం సరైన పద్ధతి కాదన్నారు. నగర పంచాయతీ మరియు పోలీసు శాఖల అనుమతులు లేకుండా రోడ్లపై కెమెరాలు ఏర్పాటు చేసి, వాటి నియంత్రణను వ్యక్తిగత ఇంట్లో ఉంచుకోవడంపై వార్డు ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. ప్రజల హక్కులు, గోప్యతను పరిరక్షించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని పేర్కొన్న ఆయన, భవిష్యత్తులో ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల సంక్షేమం, భద్రత, గోప్యతకు ప్రాధాన్యత ఇస్తూ మున్సిపాలిటీ చర్యలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు కౌన్సిలర్ తక్షణ స్పందనపై హర్షం వ్యక్తం చేస్తూ, తమ సమస్యను పరిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# బొగత జలపాతం వద్ద పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు

**- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ములుగు, మే 23 : ములుగు జిల్లాకు వచ్చే పర్యాటకులకు ఆహ్లాదకర వాతావరణంతో పాటు మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. శనివారం వాజేడు మండలం చీకుపల్లి గ్రామంలోని బొగత జలపాతాన్ని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సందర్శించి, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పర్యాటక సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని త్రాగునీరు, మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్, సీసీ కెమెరాలు, పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని సూచించారు అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, పర్యాటక ప్రాంతాల సమాచారం తెలిసేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం లేకుండా చర్యలు

- ముందస్తు ప్రణాళికలతో అప్రమత్తంగా ఉండాలి
- అన్ని ఏరియాల జీఎంలకు సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశం

(ప్రజాలక్ష్యం ప్రత్యేక ప్రతినిధి)

హైదరాబాద్, మే 23 : నైరుతి రుతుపవనాలు మరో పది రోజుల్లో రాష్ట్రంలో ప్రవేశించే అవకాశముందని వాతావరణ శాఖ సూచిస్తున్న నేపథ్యంలో, వర్షాకాలంలోనూ బొగ్గు ఉత్పత్తి, రవాణాకు ఎలాంటి అంతరాయం కలగకుండా సింగరేణి యాజమాన్యం ముందస్తు చర్యలు ప్రారంభించింది. థర్మల్ విద్యుత్ కేంద్రాలకు నిరంతర బొగ్గు సరఫరా కొనసాగించాలన్న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి శనివారం అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం సింగరేణి ఉత్పత్తి చేస్తున్న బొగ్గులో దాదాపు 95 శాతం ఓపెన్‌కాస్ట్ గనుల నుంచే వస్తోందని, భారీ వర్షాల సమయంలో గనుల్లో నీరు నిల్వ ఉండటం వల్ల ఉత్పత్తి దెబ్బతినే ప్రమాదం ఉందని సీఎండీ పేర్కొన్నారు. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు ఇప్పటికే అన్ని ఓపెన్‌కాస్ట్ గనుల్లో 100కు పైగా భారీ పంపులు, మోటార్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైతే ప్రైవేటు పంపులను కూడా వినియోగించి ఓవర్‌బర్డెన్, బొగ్గు బెంచీల వద్ద నీరు నిల్వ కాకుండా చూడాలని, హాల్‌రోడ్లను బలోపేతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో తలెత్తే సమస్యలను దృష్టిలో ఉంచుకుని తగినన్ని పంపులు, యంత్రాలు సిద్ధంగా ఉంచాలని, అవసరమైన టెండర్ల ప్రక్రియను కార్పొరేట్ కార్యాలయ అధికారులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. గనులవారీగా రూపొందించిన ప్రణాళికలు, ప్రతిపాదనలను సమీక్షిస్తూ గత రెండేళ్లలో భారీ వర్షాల ప్రభావంతో ఎక్కువగా ఉత్పత్తి నష్టపోయిన గనులపై ప్రత్యేక దృష్టి సారించాలని జీఎంలకు సూచించారు. స్థానిక వాతావరణ శాఖ హెచ్చరికలను




ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతర్జాతీయ పరిణామాల కారణంగా విద్యుత్ వినియోగం పెరిగిన నేపథ్యంలో, సింగరేణితో ఇంధన సరఫరా ఒప్పందాలు కలిగిన థర్మల్ విద్యుత్ కేంద్రాలకు నిరంతర బొగ్గు సరఫరా కొనసాగించేందుకు అన్ని ఏరియాల యాజమాన్యాలు సమన్వయంతో పనిచేయాలని సీఎండీ స్పష్టం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు సాధించిన బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓవర్‌బర్డెన్ తొలగింపు పనులపై కూడా ఆయన సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే వీలైనంత అధికంగా బొగ్గు ఉత్పత్తి చేయాలని, మొదటి త్రైమాసికంలో అధిక ఉత్పత్తి సాధించడం ద్వారా వర్షాకాల ప్రభావాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. కొన్ని ప్రధాన ఓపెన్‌కాస్ట్ గనులు లక్ష్యాలను చేరుకోలేకపోవడానికి గల కారణాలపై కూడా ఆయన లోతుగా చర్చించారు. భారీ యంత్రాల పనిగంటలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంతో పాటు మానవ వనరులను సమర్థంగా ఉపయోగించాలని ఆదేశించారు. సంస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను కార్మికులకు వివరించి, ప్రతి ఉద్యోగి సంస్థ అభివృద్ధికి భాగస్వామి అయ్యేలా చైతన్యపరచాలని సూచించారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి. సూర్యనారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ పర్సనల్ అండ్ ఫైనాన్స్ గౌతమ్ పోట్రు, డైరెక్టర్ ఈ అండ్ ఎమ్ ఎం. తిరుమలరావు, ఈడీ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న, జీఎం (కోఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్) టి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రీయ విద్యాలయ స్థల విషయంలో అనవసర రాద్ధాంతం తగదు

- భోగ శ్రావణి హయాంలో జగిత్యాల మున్సిపల్ పూర్తిగా అవినీతిమయం
- ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆద్వర్యంలో యావర్ రోడ్డు విస్తరణ
- డిసిసి అధ్యక్షుడు గాజెంగి నందయ్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 23 : కేంద్రీయ విద్యాలయ స్థలం విషయంలో అనవసర రాద్ధాంతం అవసరం లేదని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య అన్నారు. శనివారం జగిత్యాల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమింద్ల వాణి శ్రీనివాస్ తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పలు చోట్ల స్థలాలను పరిశీలించి విద్యార్థులకు అనుకూలం వుండే విధంగా కృషి చేస్తున్నారని తెలిపారు. డాక్టర్ భోగ శ్రావణి హయాంలో జగిత్యాల మున్సిపల్ పూర్తిగా అవినీతిమయం అయిందని అన్నారు. ఆమె హయాంలో ఖర్జూర మొక్కలు నాటితే ఈత పండ్లు కాస్తున్నాయని, అలాంటి మీరా ఈ రోజు మాట్లాడేది అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో బిజినెస్ చేసుకుంటూ మెరుపు తీగ లాగ జగిత్యాలకు వచ్చి ఏదో ఒకటి మాట్లాడితే ప్రజలు నమ్మరని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని అన్నారు. ఎంపీ అరవింద్ పసుపు బోర్డు అని చెప్పి రైతులను మోసం చేశారని, స్పైస్ బోర్డుతో రైతులకు ఎలాంటి లాభం లేదన్నారు. జగిత్యాల అభివృద్ధికి ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ నిరంతర కృషి ప్రధాన కారణం అని తెలిపారు. భోగ శ్రావణి మాట అదుపులో పెట్టుకొని మాట్లాడాలని లేకుంటే తగిన బుద్ది చెప్పాల్సి వస్తుందని అన్నారు. భోగ శ్రావణి మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. కేంద్రీయ విద్యాలయం స్థలం కేటాయింపులో జగిత్యాల నియోజకవర్గం అని పెట్టకుండా చల్గల్ అని పెట్టి కావాలని విద్యార్థులను నాణ్యమైన చదువుకు దూరం చేసే ప్రయత్నం ఎంపీ అరవింద్ చేస్తున్నారని ఆరోపించారు. స్థలం కేటాయించాల్సిన



బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంకు ఉంటుంది కాని చల్గల్ అని జీవో తేవడంలో రాజకీయ కోణం దాగుందన్నారు. కేంద్రీయ విద్యాలయంలో 04 తరగతితో 240 మంది విద్యార్థులకు ఉపయోగం ఉంటుందని, అందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగుల పిల్లలకు ప్రాధాన్యం ఉంటుందని, ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ లో దాదాపు 2,500 మంది విద్యార్థులకు నాణ్యమైన బోధన వసతులు అందుతాయన్నారు. వాలంతరు చాల విలువైన స్థలం కాబట్టే 02 ఎకరాలు కేటాయింపు జరిగిందని, ఇతర చోట్ల అనువైన స్థలంను కూడా ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ ప్రతిపాదించారని తెలిపారు. జగిత్యాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న నాయకులు ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ అని కొనియాడారు. జగిత్యాల ప్రజలు అడిగే ప్రశ్నల నుండి పారిపోయి హైదరాబాద్ లో ఉన్న భోగ శ్రావణి మీరా మాట్లాడేది అని ధ్వజమెత్తారు. మీ కుటుంబం చరిత్ర అందరికీ తెలుసని, అవసరమైతే మీకు మాట్లాడే భాషాపై, రాజకీయ అవగాహనపై ట్యూషన్ చెప్పిస్తామని హితవు పలికారు. జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో యావర్ రోడ్డు విస్తరణ అవుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమింద్ల వాణి శ్రీనివాస్, టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ లు గిరి నాగభూషణం, అడువాల జ్యోతి, కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్, లక్ష్మణ్, పట్టణ అధ్యక్షులు కొత్త మోహన్, జిల్లా యూత్ అధ్యక్షులు బీరం రాజేష్, కౌన్సిలర్లు దయాళ చంద్రశేఖర శంకర్, స్వప్న గిరిధర్, పద్మ రాజేందర్, మమత రామకృష్ణారెడ్డి, నాయకులు ప్రవీణ్ రావు, పులి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు



# నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

## రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, మే 23 : నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కే కన్వెన్షన్ హాల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించిన మెగా జాబ్ మేళాను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుమారు 30 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్‌లో గతంలో నిర్వహించిన జాబ్ మేళాల్లో ఎంపికైన రాజన్న సిరిసిల్ల జిల్లా అభ్యర్థులకు విప్ ఆది శ్రీనివాస్ నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ప్రజల సమస్యల పరిష్కారానికి 99 రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారని తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో సమావేశాలు నిర్వహిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నామని చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం జాబ్ మేళాలను నిర్వహిస్తోందని, ఇప్పటివరకు రాష్ట్రంలో సుమారు 70 వేల ఉద్యోగాలు కల్పించామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ రంగంలో కూడా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ మెగా జాబ్ మేళాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో గ్రూప్-1, ఉపాధ్యాయ నియామకాలు సహా పలు ఉద్యోగ నియామక ప్రక్రియలు చేపట్టామని మరిన్ని ఉద్యోగ నియామకాలు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. యువత స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని వారి కోసం సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తున్నామని, పరిశ్రమలు స్థాపించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మహిళా సంఘాలకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రుణాలు అందిస్తున్నామని, యువతి యువకులు ఈ మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# కార్మిక నేత మిర్యాల రాజిరెడ్డి కి ఆత్మీయ సన్మానం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్‌సిటి (గోదావరిఖని), మే 23 : తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కేంద్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డికి మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించినందుకు గాను యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ జాహెద్ పాషా ఘనంగా సన్మానించారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ ఆవరణలో శనివారం జరిగిన కార్యక్రమంలో మిర్యాల రాజిరెడ్డికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందిం చారు. ఈ సందర్భంగా జాహెద్ పాషా మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా కార్మిక నేతగా కొన సాగుతున్న రాజిరెడ్డి కార్మికుల హక్కులను సాధిస్తూ... కార్మికుల సమస్యలను నిరంతరం పరిష్కరించిన ఆయన భవిష్యత్తులో మరెన్నో పదవులను అధిరోహించాలన్నారు. సభ్యత్వ నమోదు ఇన్చార్జిగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా పలువురు కార్మిక నేతలు రాజిరెడ్డి కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు అడ్డగట్ల గోపి, నూతి రాజ్ కుమార్, జనగామ మల్లేష్, దూట శేషగిరి, చల్ల రవీందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.






# యువత ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

## ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే, 23 : వనపర్తి వనపర్తి జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని, యువత తమ నైపుణ్యాలను పెంపొందించుకుని అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక యువజన, క్రీడా వారోత్సవాల సందర్భంగా మే 1న మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన జాబ్ మేళాలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు ప్రొవిజనల్ అపాయింట్‌మెంట్ ఆర్డర్లను అందజేసే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వనపర్తి జిల్లా నుంచి జాబ్ మేళాలో పాల్గొని వివిధ ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగాలు సాధించిన 17 మంది యువతకు ప్రొవిజనల్ అపాయింట్‌మెంట్ ఆర్డర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన యువతను ఎమ్మెల్యే, కలెక్టర్ అభినందించారు. యువత తమ ప్రతిభను మెరుగుపర్చుకుని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పనలో ప్రత్యేక దృష్టి సారిస్తూ పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. అదేవిధంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక క్రీడా, యువజన వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఫుట్‌బాల్, వాలీబాల్, హాకీ తదితర క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు కలెక్టర్ మరియు ఎమ్మెల్యే ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవన విధానానికి క్రీడలు ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ ఫిట్‌నెస్‌ను జీవితంలో భాగంగా మార్చుకోవాలని అన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ పర్యాటక శాఖకు సంబంధించిన బ్రాండింగ్ కిట్లను కలెక్టర్, ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్, జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్ రెడ్డి, ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


# ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం

- సీసీ కెమెరాల వలన కేసుల పరిష్కారం సులువు అవుతుంది
- ఎమ్మెల్యే, పిఎసి చైర్మెన్ ఆరెకపూడి గాంధీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




శేరిలింగంపల్లి, మే 23 : ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమ వుతుందని, సీసీ కెమెరాలతో కేసుల పరిష్కారం సులువవుతుందని ఎమ్మెల్యే, పిఎసి చైర్మెన్ ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో కాలనీలో రూ. 16 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన 102 సీసీ కెమెరాలను సీపీ రమేష్ రెడ్డి, డీసీపీ రితీరాజ్, అడిషనల్ డీసీపీ సుదర్శన్, ఏసీపీ రవి కిరణ్ రెడ్డి, సిఐ శివ ప్రసాద్, తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మయూరి నగర్ కాలనీ వాసులు నా విజ్ఞప్తి మేరకు కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు కాలనీ వాసులు ముందుకు రావడం చాలా సంతోషకరమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన కాలనీ కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని తెలిపారు. ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. కాలనీలలో నేరాలు అరికట్టడానికి సీసీ కెమెరాలు ఎంతగానో తోడ్పడుతాయని, సిసి కెవరాల ఏర్పాటుకు కాలనీ వాసులు ముందుకు రావడం చాలా అభినందనీయమని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు చొరవ తీసుకోవడం చాల గొప్ప విషయమన్నారు. కాలనీ ప్రధాన కూడళ్లలో, పార్కులలో, బ్లాక్ స్పాట్‌లలో అవసరమున్న ప్రతి చోట సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, శాంతి భద్రతలు కాపాడటానికి పోలీస్ అధికారులు ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై కాలనీ వాసులకు విస్తృత ప్రచారంతో అవగాహన కలిపిస్తున్నారని, ఒక సీసీ కెమెరా 100 మంది పోలిసులతో సమానమని, సీసీ కెమెరాల వలన కేస్‌ల పరిష్కారం సులువు అవుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

# చేవెళ్ల డిక్లరేషన్ అమలుకై ఈనెల 26న గిరిజన మహాధర్నా

- ఇందిరాపార్క్‌లో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులుమూడవత్ రాంబల్ నాయక్

వికారాబాద్, మే 23 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో గిరిజనులకు ఇచ్చిన చేవెళ్ల డిక్లరేషన్ హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే గిరిజన మహాధర్నాను విజయవంతం చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మూడవత్ రాంబల్ నాయక్ పిలుపునిచ్చారు. కొడంగల్ నియోజకవర్గంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విస్లావత్ చందర్ నాయక్‌తో కలిసి మహాధర్నా పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ, గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ద్వారా గిరిజనులకు 12 కీలక హామీలు ఇచ్చినప్పటికీ, అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఒక్క హామీ కూడా అమలు కాలేదని విమర్శించారు. లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ మహాధర్నాలో రాష్ట్రవ్యాప్తంగా గిరిజనులు, విద్యార్థి సంఘాలు, ఉద్యోగ సంఘాలు, యువత, మహిళలు, తండా నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు. గత ప్రభుత్వ హయాంలో తండాలు, గూడాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయడం, గిరిజన రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచడం, సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ భవన నిర్మాణం, గిరిజన భవనాలు, తండాలకు బీటీ రోడ్లు, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా వంటి పలు కార్యక్రమాలు అమలు చేశామని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్ల డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలైన తండాలను రెవెన్యూ గ్రామపంచాయతీలుగా గుర్తించడం, గిరిజన గ్రామపంచాయతీలకు ప్రత్యేక నిధులు, పోడు భూములకు పట్టాలు, గిరిజన కార్పొరేషన్లు, మైదాన ప్రాంత ఐటిడీఏలు, గిరిజన బంధు, ఇందిరమ్మ ఇండ్లకు రూ.6 లక్షల ఆర్థిక సహాయం, విద్యార్థులకు ప్రోత్సాహకాలు, నిరుద్యోగ భృతి, స్వయం ఉపాధి రుణాలు, సబ్‌ప్లాన్ నిధుల వినియోగం, గిరిజన రైతులకు ఉచిత వ్యవసాయ సదుపాయాలు, తండాలకు బీటీ రోడ్లు వంటి అంశాలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. అదేవిధంగా కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారం, పెన్షన్ల పెంపు, రైతుబంధు, రైతు బీమా వంటి హామీలు కూడా అమలు కాలేదని పేర్కొన్నారు. గిరిజన భూములను పరిశ్రమల పేరిట స్వాధీనం చేసుకునే ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ గిరిజనుల హక్కుల సాధన కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్, కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నెహ్రూ నాయక్, సర్పంచ్ శ్రీనివాస్ నాయక్, రవి నాయక్, కిషన్ నాయక్, వేణు రవీంద్రచారి, బండి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# యువత నైపుణ్యాలు పెంచుకుని ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలి


## జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే 23 : ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో శనివారం, కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉద్యోగ సాధనపై ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా జాబ్ మేళాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమలోని నైపుణ్యాలను పెంపొందించుకుని, లభించే ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పట్టణంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన 40 మంది అభ్యర్థులకు జిల్లా అదనపు కలెక్టర్




చేతుల మీదుగా నియామక ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. జాతీయ స్థాయి యువ దినోత్సవాల్లో పాల్గొన్న 'పాటె మా ప్రాణం' సంగీత అకాడమీ కళాకారులను, జిల్లా నుండి జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. చిత్రలేఖనం, ఉపన్యాస పోటీల విజేతలకు, సాంస్కృతిక ప్రదర్శనల్లో ప్రతిభ చాటిన చిన్నారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, పరిశ్రమల శాఖ ఏడీ నరసింహారెడ్డి, ఐటీఐ ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# స్పష్టమైన లక్ష్యంతో కష్టపడి చదివితే విజయాన్ని సాధించడం సులభం

- 'స్పార్క్' కార్యక్రమంలో భాగంగా ఖాకీ కిడ్స్, పోలీసు సిబ్బందికి
- భవిష్యత్తుపై దిశానిర్దేశం చేసిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి మే 23: చిన్నప్పటి నుంచే స్పష్టమైన లక్ష్యంతో, సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ కష్టపడి చదివితే విజయాన్ని సాధించడం సులభమని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న పోలీసు కుటుంబాలకు చెందిన పిల్లలు, పోలీసు సిబ్బంది వ్యక్తిగత మరియు వృత్తిపరమైన అభివృద్ధి సాధించేందుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో "స్పార్క్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ఖాకీ కిడ్స్‌కు భవిష్యత్తులో ఉన్న అవకాశాలు, విద్య ప్రాముఖ్యత, లక్ష్య సాధన, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసంపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ఆధునిక సాంకేతికత అందుబాటులో ఉన్న ఈ రోజుల్లో సాంకేతికతను మంచికి వినియోగించుకొని విజయం దిశగా అడుగులు వేయాలని సూచించారు. గడిచిన సంవత్సరాలకు చెందిన మోడల్ పేపర్లను రిఫర్ చేయాలని, క్రమం తప్పకుండా న్యూస్ పేపర్ చదివే అలవాటు పెంపొందించుకోవాలని తెలిపారు. ఖాకీ కిడ్స్‌కు మరింత ప్రోత్సాహం అందించేందుకు జిల్లా పోలీసు కార్యాలయంలో స్టడీ హాల్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా పోలీసు సిబ్బంది విధులతో పాటు కుటుంబ సభ్యుల భవిష్యత్తుపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని, పిల్లల విద్యాభివృద్ధికి ప్రోత్సాహం అందించాలని సూచించారు.

ప్రజాలక్ష్యం

సంపాదకీయం

# రిజర్వేషన్లతో కొందరికే లబ్ధి !

స్వాతంత్ర్యం లభించి 80ఏళ్లకు చేరువలో ఉన్నాం. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ప్రజలు త్యాగాలు చేస్తుంటే కొందరు ఫలితాలు అనుభవిస్తున్నారు. ముఖ్యంగా భారతదేశంలో రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు అనుభవిస్తున్న లగ్జరీ జీవితం అంతా ఇంతా కాదు. ఒక్కసారి ఎమ్మెల్యే, ఎంపి అయితే చాలు..జీవితాంతం సుఖంగా బతికేయవచ్చన పరిస్థితి ఏర్పడింది. పేరుకే ప్రజాస్వామ్యం కానీ.. అదృష్టమంతా ప్రజాప్రతినిధులదే. అధికారాన్ని గుప్పిట్లో పెట్టుకుని ప్రజలను ఓట్లేసే పురుగుల్లా చూస్తున్నారు. కొన్ని తాయిలాలు ప్రకటించి, మొత్తం అధికారం, ఆర్థిక స్వేచ్ఛ వారు అనుభవిస్తున్నారు. అందుకే ప్రజల్లో నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆగ్రహం అప్పుడప్పుడు కట్టలు తెంచుకుంటోంది. ఒక్కోసారి చిన్న సమస్యగా ఉన్న వ్యవహారం పెద్ద ఎత్తున ఉవ్వెత్తున ఎగిసి పడుతోంది. ఇటీవల కాక్రోచ్ జనతా పార్టీ ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవాలి. ప్రజల్లో ఏమూలో దాగివున్న ఆగ్రహం ఇలా బయటకు వస్తోంది. వివిధ రూపాల్లో ఉన్న వ్యతిరేకత ఒక్కటైతే రాజకీయ పార్టీల నేతలు తట్టుకోవడం కష్టం. అనేక దేశాల్లో ఇలాగే ప్రజాగ్రహం కట్టలు తెంచుకున్న సంగతి చూశాం. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, వెనిజులా తదితర దేశాల్లో ప్రజల ఆగ్రం ఎలా పరిణమించిందో చూశాం. అందువల్ల పాలకులు ప్రజాసంక్షేమం కోరి నిర్ణయాలు తీసుకోవాలి. వాటిని ఆచరణలో పెట్టాలి. నిరంతరం సమస్యలతో పోరాడుతున్న ప్రజలను పట్టించుకోవాలి. తమ సుఖం కాదు..ప్రజల సంక్షేమం ముఖ్యమని గమనించాలి. ధాన్యం కొనుగోలల్లు కావచ్చు, ఫీజుల మోత కావచ్చు... నిరుద్యోగం కావచ్చు...ఇలా అనేక సమస్యలపై ప్రజల్లో ఆందోళనలు గూడుకట్టుకుని ఉన్నాయి. అందుకే తరతరాలుగా అధికారంలో తామే ఉండాలన్న కుటిల రాజకీయాలు మానాలి. ఇకపోతే తాజాగా సుప్రీం ధర్మాసనం రిజర్వేషన్ల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. దీనిపై చర్చ జరగాలి. చట్టసభల్లో ఇలాంటి వాటిపై చర్చించాలి. కొందరే రిజర్వేషన్ల ఫలాలు అనుభవించడంపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. కొందరే వీటిని పదేపదే అనుభవించడం ద్వారా మిగతావారికి అడ్డుపడుతున్నారని అభిప్రాయపడింది. గతంలో సిజెఐగా పనిచేసిన బిఆర్ గవాయ్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. క్రిమీలేయర్ ఉండాలని ఆయన ఆనాడు అభిప్రాయపడ్డారు. కొందరు రిజర్వేషన్లు అనుభవించాక, తమ కుటుంబంలోని వారంతా అదే రిజర్వేషన్ల మెట్లెక్కాలని చూస్తున్నారు. తాజాగా ఇప్పుడు సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాలు పదేపదే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఎందుకంటే ఇలా ర ఇజర్వేషన్లు పొందిన వారు రాజకీయంగా వారే స్థిరపడిపోతున్నారు. ఉన్నత శ్రేణి ఉద్యోగలు సాధించిన ఐఎఎస్, ఐపిఎస్‌లు కూడా తమ పిల్లకు రిజర్వేషన్లు పొందుతున్నారు. దీనినే సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజి కంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయి లో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధిం చింది. ఇది చర్చించాలి. లేకుంటే ప్రజల్లో ఇలాంటి వ్యత్యాసా లపైనా వ్యతిరేకత వస్తుంది. ఎక్కడో ఒకచోట దీనికి చెక్ పెట్టాలి. రిజర్వేషన్లు ఎల్లకాలం కాదన్న నిజం బయటకు రావాలి. అవసరమైతే చట్టం చేయాలి. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమీలేయర్' పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భం గా జస్టిస్ బి.వి.నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధి కారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నా రు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం రిజర్వేషన్ కోటాను ఆశించ డం సరికాదన్నారు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చని, కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించుకుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. రాజకీయంగా ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లు పొందుతున్న వారు తమ కుటుంబాలకు కూడా రిజర్వేషన్ కోటాలో లబ్ధి పొందుతున్నారు. ఒకే కుటుంబం నుంచి రిజర్వేషన్ల కోటాలో ఎన్నికై ఎమ్మెల్యేలు, ఎంపిలు అయి మంత్రి పదవులు అనుభవిస్తున్నారు. ఇలాంటి వారివల్ల పక్కన ఉన్నవారు ఎన్నటికీ రిజర్వేషన్లు పొందలేక పోతున్నారు. దీనిపై దేశవ్యాప్తం చర్చ జరగాలి. కాక్రోచ్ జనతాపార్టీ కూడా చర్చించాలి. వెనకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా ఉన్నత స్థితిలో ఉన్న కుటుంబాలకు చెందిన పిల్లలకు రిజర్వేషన్లు ఎందుకని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అలాంటి వారు కూడా రిజర్వేషన్లు కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి తల్లిదండ్రులిద్దరూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అయినందున క్రీమీలేయర్ కిందకు వస్తారని.. రిజర్వేషన్ వర్తించదంటూ ఆ రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇచ్చింది. దాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా రిజర్వేషన్లపై కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పుడు రాజకీయాల్లోనూ రిజర్వేషన్లపై చర్చించాలి. అప్పుడే మిగతా వారికి రిజర్వేషన్ ఫలాలు దక్కుతాయి.

# అలంకార ప్రాయంగా మిగిలిపోతున్న కామన్వెల్త్

## మే 24... కామన్వెల్త్ దినోత్సవం



రామకిష్టయ్య సంగన భట్ల
9440595494

కామన్వెల్త్ అనేది.. ఆయా దేశాలు ఎలాంటి లాంఛనప్రాయమైన కట్టుబాట్లు లేకుండా.. సుహృద్భావంతో స్నేహపూర్వకంగా చారిత్రక సంబంధాలను కొనసాగిస్తూ కలిసివుండటానికి గల ఒక మార్గం. కామన్వెల్త్... ప్రపంచంలోని మూడో వంతు జనాభా గల దేశాల కూటమి. ఎన్నో మతాలు, జాతులు, భాషలు, సంస్కృతుల వారు ఇందులో భాగంగా ఉన్నారు.

బ్రిటీష్ సామ్రాజ్యం దాని వలస రాజ్యాల స్థాపన ప్రక్రియను ప్రారంభించినప్పుడు, మాజీ బ్రిటిష్ కాలనీల నుండి స్వతంత్ర రాష్ట్రాల ఏర్పాటుకు, గతంలో సామ్రాజ్యంలో భాగమైన దేశాల సంస్థ యొక్క అవసరం ఏర్పడింది.

కామన్వెల్త్ దినోత్సవాన్ని అంతకు ముందు 'ఎంపైర్ డే' అని పిలిచేవారు. అప్పటి రాయల్ కామన్వెల్త్ సొసైటి అయిన రాయల్ కలోనియల్ ఇన్స్టిట్యూట్ కెనడియన్ శాఖ 'ఎంపైర్ డే 'జరపాలన్న సూచన చేసింది. ఈ ప్రతిపాదనను 1898 లో కెనడియన్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ సమావేశంలో ప్రవేశ పెట్టగా ఏకగ్రీవంగా అమోదించారు. అలా 'ఎంపైర్ డే ' ఓ జాతీయ కార్యక్రమమైనది. 1884 లో, లార్డ్ రోజ్‌బెరీ అనే బ్రిటిష్ రాజకీయ నాయకుడు మారుతున్న బ్రిటిష్ సామ్రాజ్యాన్ని "కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్" గా అభివర్ణించాడు. ఇరవయ్యో శతాబ్దం ఆరంభంలో బ్రిటిష్ వలస పాలనలోని పలు దేశాలు స్వాతంత్ర్యం పొందటం ప్రారంభమైంది. ఆ క్రమంలో ఆయా దేశాలకు బ్రిటన్‌కు మధ్య.. ఆయా దేశాల మధ్య సంబంధాలు ఎలా ఉండాలనేందుకు ఒక రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థ అవసరమైంది.

1916 మే 24 వ తేదీన యునైటెడ్ కింగ్డమ్ లో తొలిసారిగా 'ఎంపైర్ డే' ను దేశవ్యాప్తంగా జరుపుకున్నారు . 70 వేల స్కూళ్ళు , స్టాక్ ఎక్స్ఛేంజ్ వంటి సంస్థలు జెండా వందనం చేసి జాతీయ గీతంను ఆలపించారు. 1921 జనవరిలో 'ఎంపైర్ డే ' ఉద్యమాన్ని వీలైనంతగా ముందుకు తీసుకువెళ్ళాలని భావించిన ' మీథ్ రాయల్ కలోనియల్ ఇన్స్టిట్యూట్ ను లాంచనంగా అహ్వానించారు. ఇన్స్టిట్యూట్ సభ్యులతో ఏర్పాటు చేసిన కమిటీ, మీథ్ బృందము కలిసి ఉద్యమ కార్యక్రమాలను రూపొందించారు. 1927 నుండి 1929 వరకు ఉద్యమ తొలి అధ్యక్షుడుగా మీథ్ కొనసాగాడు. 1901లో మరణించిన క్వీన్ విక్టోరియా జన్మదినం అయిన మే 24 వ తేదీన ఏటా 'ఎంపైర్ డే' నిర్వహించాలని నిర్ణయించారు. అలా 1931లో 'బ్రిటిష్ కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్' ఏర్పడింది. 1931 లో, యునైటెడ్ కింగ్‌డమ్, కెనడా, ఐరిష్ ఫ్రీ స్టేట్, న్యూఫౌండ్లాండ్, యూనియన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికాతో... ఐదు ప్రారంభ సభ్యులతో బ్రిటిష్ కామన్వెల్త్ నేషన్స్ వెస్ట్ మినిస్టర్ శాసనం క్రింద స్థాపించ బడింది.

1931లో 'బ్రిటిష్ కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్' ఏర్పడగా, . 1949లో ఆ పేరు నుండి 'బ్రిటిష్' పదాన్ని తొలగించారు. ఆ కూటమిలో చేరటమనేది ఆయా దేశాల ఇష్టాయిష్టాల మేరకే జరుగుతుంది. అలా 53 దేశాలు ఇందులో సభ్యులుగా చేరాయి. చివరిగా చేరిన మొజాంబిక్, రువాండాలకు బ్రిటిష్ వలస రాజ్యంతో ఎలాంటి సంబంధం లేదు. బ్రిటిష్ వలస పాలన నుంచి విముక్తమైన దేశాల కూటమిగా అది మారింది. ఆధునిక కామన్వెల్త్ కూటమి మొదట ఆస్ట్రేలియా, కెనడా, భారత్, న్యూజిలాండ్, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, యూకేలు సభ్య దేశాలుగా స్వతంత్ర దేశాల 'ఫ్రీ అసోసియేషన్' పేరుతో అది ఏర్పడింది. ఆ తరవాత అది 'కామన్వెల్త్ నేషన్స్'గా రూపాంతరం చెందింది.

కామన్వెల్త్ కూటమిలో భాగమైన అత్యధిక దేశాలు బ్రిటిష్ సామ్రాజ్య పాలనతో ఏదో విధంగా సంబంధం ఉన్నవే. రవాండా, మొజాంబిక్ లాంటి దేశాలు మాత్రమే వాటికి అతీతం. రవాండా 2009లో, మొజాంబిక్ 1995లో కామన్వెల్త్ దేశాల కూటమిలో భాగమయ్యాయి. అవి గతంలో బ్రిటిష్ పాలనలో లేవు. ప్రపంచ దేశాలన్నింటి విస్తీర్ణంలో పావు భాగాన్ని కామన్వెల్త్ దేశాలే ఆక్రమిస్తున్నాయి. విస్తీర్ణం పరంగా కెనడా కామన్వెల్త్ కూటమిలో తొలిస్థానంలో, ప్రపంచంలో రెండో స్థానంలో ఉంది. ఆస్ట్రేలియా, భారత్‌లు కూడా విస్తీర్ణం పరంగా చాలా పెద్దవి. సమోవా, టువాలు, ఆంటిగ్వా లాంటి చిన్న దేశాలు కూడా కూటమిలో భాగంగా ఉన్నాయి. దాదాపు 790 కోట్ల ప్రపంచ జానాభాలో 260 కోట్ల మంది.. అంటే మూడో వంతు ప్రజలు కామన్వెల్త్ కూటమిలో భాగమైన 53 దేశాల్లోనే జీవిస్తున్నారు. ఈ దేశాల్లో ఎక్కువమంది 30 ఏళ్ల లోపువారే. ఈ కూటమిలో జనాభా పరంగా భారతే అతిపెద్ద దేశం. మొత్తం కామన్వెల్త్ కూటమి దేశాల జనాభాలో సగం భారత్‌లోనే ఉంది. కూటమిలోని




31 దేశాల జనాభా 16 లక్షల కంటే తక్కువే. 2012 దాకా కామన్వెల్త్ కూటమికి ఎలాంటి రాజ్యాంగం లేదు. ఆ తరవాతే ప్రజాస్వామ్యం, లింగ సమానత్వం, శాంతి, భద్రత లాంటి 16 విలువలకు సభ్య దేశాలు కట్టుబడి ఉండాలని తీర్మానించు కున్నాయి. కామన్వెల్త్ సెక్రటేరియట్ లండన్‌లో ఉంది. విద్యా రంగం నుంచి పట్టణ ప్రణాళిక వరకూ అనేక రంగాల్లో కామన్వెల్త్ సంస్థలు కృషి చేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ఆయా దేశాల్లో ఎన్నికలు సక్రమంగా జరిగేలా చూసేందుకు పరిశీలకులు కూడా హాజరవుతుంటారు.

అంతర్జాతీయ వ్యవహారాల్లో ఇతర దేశాల మీద ఆ కూటమి చూపే ప్రభావం ఏదీ లేదనే చర్చ ఉంది. సభ్య దేశాల మధ్య వాణిజ్య సంబంధాల కోసం కామన్వెల్త్ చేస్తున్నదేమీ లేదు. ఇందుకోసం అన్ని దేశాలూ ఏదో ఒక ప్రాంతీయ కూటమి లోనో అంతర్జాతీయ కూటమి లోనో భాగస్వాములుగా ఉన్నాయి. కామన్వెల్త్ అనేది రెండేళ్ల కోసారి కామన్వెల్త్ దేశాల రాజకీయ అధినేతల సమావేశం, నాలుగేళ్లకోసారి కొన్ని పతకాల కోసం క్రీడలను నిర్వహించే అలంకార ప్రాయమైన సంస్థగా మిగిలిపోతున్నదనే విమర్శలు కూడా లేక పోలేదు

**వ్యాసకర్త : సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.**

# సరిహద్దులోనూ అక్రమ రవాణాలను పూర్తిగా అరికట్టాలి

**- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ - గ్రామాలను సందర్శిస్తూ విపిఓ విధానాన్ని అమలు చేయాలి**

**- సైబర్ క్రైమ్‌లపై ప్రజలకు అవగాహన కల్పించాలి.**

**- గుడుంబా, గంజాయి, అసంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాలి**

**- విధులలో నిజాయితీ, క్రమశిక్షణ తప్పనిసరి. - గాదిగూడ పోలీస్ స్టేషన్ పరిశీలన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆదిలాబాద్, మే 23 : మహారాష్ట్ర సరిహద్దు నుండి అక్రమ రవాణా జరగకుండా పూర్తిగా అడ్డుకట్ట వేయగలరని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శనివారం గాదిగూడ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ పరిశీలించారు. మొదటగా ఎస్ఐ రమ్య పూలమొక్క అందజేసి జిల్లా ఎస్పీకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని తెలిపారు. పోలీసు ప్రతి ఒక్కరూ సక్రమమైన యూనిఫామ్ ధరించాలని, విధులలో నీతి నిజాయితీ, క్రమశిక్షణ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. గ్రామాలను సందర్శిస్తూ విపిఓ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. మహారాష్ట్ర సరిహద్దు గుండా పశువులు, రాయితీ బియ్యం, గుడుంబా, గంజాయి తరలకుండా చర్యలు చేపట్టాలని, మండల పరిధిలో మాదకద్రవ్యాల నిర్మూలనకు వాటి వల్ల కలుగు అనార్థాలపై ప్రజలకు సవివరంగా తెలియజేసి చైతన్య పరచాలని తెలిపారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా ఉండాలని, సిబ్బంది విధుల పై పర్యవేక్షణ చేయాలని తెలిపారు.




గ్రామాలను సందర్శిస్తూ డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా పర్యవేక్షించాలని, ప్రజలకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. పోలీస్ స్టేషన్లోని రిసెప్షన్ ను పరిశీలించి బాధితుల సమస్యల పట్ల బాధ్యతయుతంగా వ్యవహరించి పరిష్కారానికి కృషి చేయాలి అన్నారు. స్టేషన్లో పెండింగ్లో ఉన్న రికార్డులు త్వరితగతిన పూర్తి చేసి ఛార్జ్ షీటు దాఖలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్వీక్ సాయి కొట్టే, ఎస్ఐ రమ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్త పరిస్థితులు

**- ఇరాన్‌పై దాడులకు అమెరికా సన్నద్ధమైనట్లుగా వార్తలు**

**- తమ గగన తలాన్ని మూసేస్తూ ఇరాన్ ఆదేశాలు**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

టెహ్రాన్, మే 23 : పశ్చిమాసియాలో పరిస్థితులు ఎప్పటికప్పుడు మారిపోతున్నాయి. ఓవైపు చర్చలు కొనసాగుతుండగానే.. ఇరాన్‌పై మరోసారి దాడికి దిగేందుకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వార్తలు వెలువడ్డాయి. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ తన గగనతలాన్ని మూసివేసింది. దేశంలోని పశ్చిమ ప్రాంతం వైపున్న గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ఇరాన్ పౌర విమానయాన సంస్థ విమానయాన సిబ్బందికి నోటమ్ జారీ చేసింది. ఈనెల 25 వరకు అన్ని విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు తెలిపింది. ఈ నోటమ్ జారీ చేసే సమయంలో ఖతార్ ప్రభుత్వానికి చెందిన ఓ వీఐపీ విమానం ఇరాన్ గగనతలాన్ని దాటింది. ఆ విమానం శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చల కోసం టెహ్రాన్‌కు వచ్చిన ఖతార్ ప్రతినిధి బృందానికి చెందినదిగా తెలుస్తోంది. ఇక, అమెరికా– ఇరాన్ మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయని, ఒప్పందానికి సంబంధించిన చాలా అంశాల్లో ఇరుదేశాల మధ్య సయోధ్య కుదిరినట్లు తెలుస్తోంది. దీంతో ఏ క్షణమైనా ఒప్పంద ప్రకటన వెలువడే అవకాశముంది. అదే సమయంలో ఈ దౌత్య ప్రయత్నాలు చివరి నిమిషంలో విఫలమైతే.. టెహ్రాన్‌పై మళ్లీ దాడులు చేసే విషయాన్ని అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ఇరాన్ కూడా తన గగనతలాన్ని మూసివేయడంతో.. పశ్చిమాసియాలో ఏ క్షణాన ఏం జరుగుతుందోననే భయాందోళనలు నెలకొన్నాయి. అమెరికా మరోసారి దాడులకు సిద్ధం అవుతోందన్న వార్తల నేపథ్యంలో ఇరాన్ ఇలా అప్రమత్తమైంది. ఈ పరిణామంతో గల్ఫ్‌లో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. యూఎస్ మరోసారి యుద్ధాన్ని ప్రారంభించిన పక్షంలో దీటుగా ఎదుర్కొనేందుకు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్, ఇతర సాయుధ దళాలు సిద్ధమవుతున్నట్టు ఇరాన్ వార్తా సంస్థ తస్నిమ్ ఒక కథనాన్ని ప్రచురించింది. అమెరికా ఆస్తులకు నష్టం కలిగేలా, ప్రయోజనాలు దెబ్బతినేలా దాడులకు ప్రణాళికలను ఇరాన్ మిలిటరీ సిద్ధం చేసినట్టు సమాచారం. ఈ వారాంతాన్ని న్యూజెర్సీలో గడపాల్సిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చివరి నిమిషంలో తన ప్లాన్స్‌ను అకస్మాత్తుగా రద్దు చేసుకుని రాజధాని వాషింగ్టన్‌కు తిరిగొచ్చారు. దీంతో, పశ్చిమాసియాలో మళ్లీ ఘర్షణలు మొదలవుతాయన్న వార్తలు మీడియాలో వెలువడ్డాయి. ఈ వారాంతంలో మెమోరియల్ డే వేడుకల్లో పాల్గొనాల్సిన అమెరికా నిఘా సంస్థల సీనియర్ అధికారులు కూడా తమ ప్రణాళికలను రద్దు చేసుకుని వాషింగ్టన్‌కు తిరిగొచ్చేశారు. రాబోయే 24 గంటల్లో దౌత్యపరమైన పురోగతి లేని పక్షంలో దాడులు మొదలుపెట్టేందుకు ట్రంప్ కూడా సుముఖంగానే ఉన్నట్టు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పరిస్థితులు అంతకంతకూ ఉద్రిక్తంగా మారుతున్నా తెరవెనుక దౌత్యమార్గాల్లో ప్రయత్నాలు ముమ్మర స్థాయిలో జరుగుతున్నట్టు కూడా తెలుస్తోంది. చర్చల్లో కొంత పురోగతి కనిపించిందని విశ్వసనీయ వర్గాలు చెప్పినట్టు తస్నిమ్ వార్తా సంస్థ పేర్కొంది.

# కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడండి

**- సోమవారం నుండి జొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం**

**- సమీక్షాలో పాల్గొన్న కలెక్టర్ భవేష్ మిశ్రా**

**- ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, ప్రతినిధి: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని, ఇబ్బందులు కలగకుండా అధికారులు చూడాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎమ్మెల్యేపవార్ రామరావ్ పటేల్‌లుసూచించారు. శనివారం బైంసాలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో తహసీల్దార్ లు, వ్యవసాయ శాఖ అధికారులు, మార్క్ ఫెడ్ అధికారులచే సమీక్ష సమావేశాన్ని నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో గన్ని సంచుల కొరత, లారీల ఏర్పాట్లు, తదితర అంశాలపై కలెక్టర్ ఎమ్మెల్యే చర్చించారు. పంటలను త్వరితగతిన తరలించే ఏర్పాటు చేయాలని సూచిస్తూ, అధికారులు చెప్పిన సమస్యను విన్నారు. అదేవిధంగా వచ్చే సోమవారం నుండి జొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని, రైతులు తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో అమ్మి మద్దతు ధర పొందాలన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ సాంకేత్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావ్ పటేల్, మున్సిపల్ చైర్మన్ తుమొల్ల దత్త్రాత్రి తో పాటు, అధికారులు పాల్గొన్నారు.

# బెంగుళూరులో కాక్రోచ్ జనతా పార్టీ

**- నేడు మానవహరం అంటూ వెలసిన పోస్టర్లు**

**- అలాంటిదేమీ లేదంటూ పోలీసుల కొట్టివేత**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

బెంగళూరు, మే 23 : సోషల్ మీడియాలో సంచలనం సృష్టించిన 'బొద్దింకల జనతా పార్టీ' పేరుతో మే 24న బెంగళూరు లో మానవహారం నిర్వహించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. 'బొద్దింకల జనతా పార్టీ కర్ణాటక' పేరుతో విడుదలైన పోస్టర్‌లో టౌన్ హాల్ సమీపంలో శాంతియుత మానవహారం చేపడతామని పేర్కొన్నారు. 'బొద్దింకల శక్తి ఆన్‌లైన్‌లోనే కాదు, వీధుల్లో కూడా ఉంది' అని పోస్టర్‌లో పేర్కొనడం చర్చనీయాంశమైంది. అయితే ఈ కార్యక్రమానికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదని బెంగళూరు పోలీసులు స్పష్టం చేశారు. మానవహారం నిర్వహించేందుకు ఏ వ్యక్తి, సంస్థ లేదా రాజకీయ పార్టీ నుంచి ఇప్పటివరకు దరఖాస్తు రాలేదని తెలిపారు. టౌన్ హాల్ పరిసరాల్లో అనుమతి లేకుండా గుమికూడవద్దని, సోషల్ మీడియాలో ఈ కార్యక్రమానికి సంబంధించిన సందేశాలను షేర్ చేయువద్దని హెచ్చరించారు. నిరుద్యోగ యువతను బొద్దింకలతో పోలుస్తూ ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలపై వ్యంగ్యంగా స్పందిస్తూ 'బొద్దింకల జనతా పార్టీ' పేరుతో సోషల్ మీడియాలో ప్రచారం ప్రారంభమైంది. ఈ పేరుతో ప్రారంభమైన ఎక్స్ ఖాతా కొద్ది రోజుల్లోనే వైరల్‌గా మారింది. అనంతరం ఆ ఖాతా నిలిపివేయబడినప్పటికీ, ఇన్‌స్టాగ్రామ్‌లో సీజేపీకి భారీ స్థాయిలో ఆదరణ లభించింది. కొద్ది రోజుల్లోనే సీజేపీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా 1.85 కోట్ల ఫాలోవర్లను సంపాదించి, ప్రధాన రాజకీయ పార్టీల అధికారిక పేజీలను అధిగమించింది. పుణెకు చెందిన అభిజీత్ దీప్కే అనే యువకుడు ఈ ఖాతాను ప్రారంభించారు. ఖాతా నిలిపివేసిన తరువాత తనకు ప్రాణహాని బెదిరింపులు వస్తున్నాయని ఆయన తెలిపారు.

# అసత్య ప్రచారాలతో కార్మికులను మభ్యపెడుతున్న గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు

## టీబీజీకేఎస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 23 : అబద్ధపు ప్రచారాలతో పబ్బం గడుపుతున్న గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలైన ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ వైఖరిని కార్మికవర్గం అర్థం చేసుకోవాలనీ టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామ్మూర్తితో కలిసి ఆయన మాట్లాడుతూ ఐఎన్టీయూసీ నాయకులు కార్మికుల సమస్యలపై మంత్రులను, సి అండ్ ఎండీనీ కలిసామని పాత ఫోటోలను కాపీ పేస్ట్ చేస్తూ కార్మికులను మభ్యపెడుతూ వస్తున్నారని ఆరోపించారు. మేమంటే మేము సాధించామని చెప్పుకునే ఈనెల 23, 24 తేదీలలో జరిగే మెడికల్ బోర్డు రెగ్యులర్ బోర్డు కాదని, గతంలో మెడికల్ బోర్డుకు వెళ్ళి ఫిట్ కాకుండా పెండింగ్ లో ఉన్నవారిని పిలిచే మెడికల్ బోర్డు అని అన్నారు. రెగ్యులర్ మెడికల్ బోర్డును నిర్వహించాలని టీబీజీకేఎస్ కోరుకుంటుందని తెలిపారు. సింగరేణిలో కొత్త గనుల మాట ఉత్తిదే అని, గతంలో ఉన్న అండర్ గ్రౌండ్ గనులను ఓపెన్ కాస్ట్ లు చేయడం, ఓపెన్ కాస్ట్ లను ఎక్స్టెన్షన్ చేయడం తప్ప కొత్త గనుల ఊసేలేదనీ తెలిపారు. మారుపేర్ల విజిలెన్స్ సమస్యలను పరిష్కరిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వ సంఘాలు 10వ తరగతి పాస్ అయిన కార్మికులను విజిలెన్స్ కు పంపుతామని వచ్చిన సర్క్యులర్ ను ఎందుకు అడ్డుకోలేక పోతున్నారో సమాధానం చెప్పాలన్నారు. ఇలాంటి కార్మిక సంఘాలను కార్మికవర్గం నమ్మొద్దని, పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని, యువ కార్మికులకు అండగా టీబీజీకేఎస్ నిలబడుతుందని, కార్మిక సమస్యలపై పోరాటం చేస్తుందని వెల్లడించారు. ప్రభుత్వం చేసిన వేతన సవరణ కారణంగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఒక్క రూపాయి కూడా అదనంగా పెరుగదని, షెడ్యూల్ లో ఉన్న అసంఘటిత కార్మికులకు మాత్రమే వేతన సవరణ వర్తిస్తుందని తెలిపారు. ఆది కూడా నష్ట దాయకమైన వేతన సవరణ అని రామ్మూర్తి వెల్లడించారు. ఇంకా ఈ మీడియా సమావేశంలో టీబీజీకేఎస్ నాయకులు నూనె కొమురయ్య, ఐలి శ్రీనివాస్, చల్లా రవీందర్ రెడ్డి, జాహెద్ పాషా, చెల్పూరి సతీష్, శేషగిరి, నూతి రాజ్ కుమార్, రొద్ద సంపత్, కళాధర్ రెడ్డి, శ్రావణ్ కుమార్, బేతి చంద్రయ్య, మహేష్, కొప్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# ముగిసిన ఉద్యోగ సాధన మేళా

## - ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేసిన కలెక్టర్ శ్రీహర్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, మే 23 : ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 'ఉద్యోగ సాధన మేళా' శనివారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో విజయవంతంగా ముగిసింది. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని వివిధ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు టాస్క్, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఉపాధి అవకాశాలు అందిస్తున్నామని, యువతి-యువకులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం యూత్ పార్లమెంట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేక మెమెంటోలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి ఎ.సురేష్, జిల్లా ఎంప్లాయ్మెంట్ అధికారి ఎం.రాజశేఖర్, డీఐసీ జీఎం కీర్తికాంత్, టాస్క్ డీట్ అధికారి కౌసల్య, ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, వైస్ ప్రిన్సిపాల్, ట్రైనింగ్ అధికారులు, అసిస్టెంట్ ట్రైనింగ్ అధికారులు, పీఈటీలు కుమార్, దుర్గాప్రసాద్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.మందుల కొనుగోలు చేసె వారి వివరాలు సేకరించాలన్నారు బస్టాండ్ ,రైల్వే స్టేషన్ లో అనుమానస్పదంగా సంచరించే వారి వివరాలు సేకరించాలన్నారు గంజాయి సేకరించడం వల్ల ఆరోగ్యం చెడిపోయి ఆర్దికంగా కుటుంబాలు చితికిపోతున్నాయని గంజాయి నివారణకు గ్రామాలలో విస్తృత అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలన్నారు ఆటో డ్రైవర్లు వాహనాల డ్రైవర్ల కు గంజాయి రవాణాచేయడం వల్ల జరిగే నష్టాల పై అవగాహానా కల్పించాలన్నారు ప్రతి ఒక్కరు గంజాయి సాగు అక్రమ రవాణా నివారణకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

# గంజాయి సాగు, అక్రమ రవాణా నివారణకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలి : కలెక్టర్ కె హరిత



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 23 : జిల్లాలో అక్రమంగా గంజాయి సాగు చేసిన వినియోగించినసంభందిత ఆదికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె హరిత అన్నారు శనివారం సమీకృత కల్లెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో సంబందిత శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశానికి అదనపు ఎస్పి అడ్మిన్ చిత్తరంజన్ ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు తో కలిసి కలెక్టర్ కె హరిత పాల్గొన్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు చేసిన అక్రమంగా రవాణా చేసే వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె హరిత అన్నారు మహారాష్ట్ర ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాల నుండి వచ్చే వాహనాలను రవాణా శాఖ ఆదికారులు క్షున్నంగా తనిఖిలు నిర్వహించాలన్నారు కల్లు కంపౌండ్ లలో విక్రయించే తెల్లకల్లు శాశీపిల్ ను తిసుకోవలన్నారు కల్లు కాంపౌండ్ లలో సి సి కెమరాలు ఏర్పాటు చేయాలన్నారు జిల్లాలో పాఠశాల పరిసరాలలోని వంద మీటర్ల పరిధిలో వున్నా పాన్ టేలాలను క్షున్నంగా తనిఖీలు నిర్వహించాలన్నారు గంజాయి సాగు చేసె వారికి ప్రభుత్వ పథకాలు రద్దు చేయాలన్నారు అడవులో గంజాయి సాగు చేయకుండా అటవీ శాఖా అధికారులు చర్యలు తిసుకోవలన్నారు మెడికల్ షాప్ లను తనిఖీలు నిర్వహించి అధిక మోతాదు మత్తు మందుల కొనుగోలు చేసె వారి వివరాలు సేకరించాలన్నారు బస్టాండ్ ,రైల్వే స్టేషన్ లో అనుమానస్పదంగా సంచరించే వారి వివరాలు సేకరించాలన్నారు గంజాయి సేకరించడం వల్ల ఆరోగ్యం చెడిపోయి ఆర్దికంగా కుటుంబాలు చితికిపోతున్నాయని గంజాయి నివారణకు గ్రామాలలో విస్తృత అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలన్నారు ఆటో డ్రైవర్లు వాహనాల డ్రైవర్ల కు గంజాయి రవాణాచేయడం వల్ల జరిగే నష్టాల పై అవగాహానా కల్పించాలన్నారు ప్రతి ఒక్కరు గంజాయి సాగు అక్రమ రవాణా నివారణకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు





# ఓటర్ల మ్యాపింగ్‌లో మహబూబాబాద్ జిల్లాది మొదటి స్థానం

## - 92.24 శాతం మ్యాపింగ్ - జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 23 : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, ఎస్ఐఆర్ కు ముందస్తు సన్నాహాల్లో భాగంగా మ్యాపింగ్‌లో రాష్ట్రంలో అత్యధికంగా మహబూబాబాద్ జిల్లాలో 92.24 శాతం మ్యాపింగ్ చేసి రాష్ట్రంలోనే ముందు వరుసలో వుందని జిల్లా ఉ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2002, 2025 రెండు ఓటరు జాబితాల్లోనూ పేర్లు ఉంటే ఓటర్లు ఆధారాల కోసం ఎలాంటి ధ్రువపత్రాలు చూపాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం జరుగుతున్న మ్యాపింగ్‌లో ధ్రువపత్రాలు సమర్పించాలన్నారు, క్షేత్రస్థాయిలో బిఎల్వోలు, భారత్ ఎన్నికల చట్టం ప్రకారం ఓటర్ జాబితా తయారు చేయడం జరుగుతుందని, సవరణలకు పూర్తిగా అధికారం కలిగి ఉందని, ఓటర్ జాబితా యొక్క సమగ్రతను కాపాడడానికి కమిషన్ ప్రతి ఎన్నికలకు ముందు లేదా అవసరాన్ని బట్టి ఓటరు జాబితా సవరణలకు ఆదేశించడం జరుగుతుందని అన్నారు, ప్రస్తుతం ప్రజలు తరచుగా వలసలు వెళ్లడం వల్ల ఉన్న ఓటరు జాబితాలో అనేక మార్పులు చోటుచేసు కున్నాయని, ఓటరు ఒకటి కంటే ఎక్కువ ప్రదేశాలలో నమోదు అయి ఉన్నారని, మరణించిన ఓటర్లు పేర్లు తొలగించడం తదితర సమస్యలను ఉత్పన్నమయ్యాయి అని అన్నారు. అర్హుడైన పౌరుడు ఓటరు జాబితా నుండి తప్పి పోకుండా, అనర్హుడు దీని నుండి తొలగించే ముఖ్య లక్ష్యంతో ఎన్నికల సంఘం ఈ ప్రత్యేక సమగ్ర సవరణ ను ప్రకటించింది అన్నారు.ఎస్ ఐ ఆర్ సవరణ కోసం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు మార్నేని వెంకన్న, సురేష్ నాయుడు, శ్యామ్ లోయ శర్మ,చక్రపాణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, సూపరింటెంట్ కిరణ్, రంజిత్ తదితరులు ఉన్నారు.

# చర్చిలు మసీదుల పేరిట ఆక్రమణకు గురవుతున్న సింగరేణి భూములు

## - పట్టించుకోని ఆర్జీవన్ యాజమాన్యం - జీఎం ఆఫీస్ ముందు విహెచ్‌పి, బజరంగ్ దళ్ ధర్నా

## - వీఎచ్‌పి నాయకులు రవీందర్, బజరంగ్ దళ్ నాయకులు సంపత్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటీ (గోదావరిఖని), మే 23 : గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో చర్చిలు,మసీదులు సింగరేణి స్థలాలను ఆక్రమణలను, కబ్జాలను పట్టించుకొని సింగరేణి యాజమాన్యం విధానాన్ని నిరసిస్తూ ఆర్జీవన్ జీఎం ఆఫీస్ ముందు విశ్వహిందూ పరిషత్ బజరంగ్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ విభాగ కార్యదర్శి అయోధ్య రవీందర్ బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ ముష్కే సంపత్ యాదవ్‌లు మాట్లాడుతూ గోదావరిఖని నడి బొడ్డున సింగరేణి సంస్థ గతంలో ప్రజల కోసం నిర్మించిన సులబ్ కాంప్లెక్స్ మరుగుదొడ్డిని కూల్చి అక్రమంగా స్థలాన్ని క్రైస్తవ చర్చి మాఫియా ఆక్రమం చేసిందని ఆరోపించారు.గతంలో సింగరేణి యాజమాన్యానికి ఫిర్యాదు చేసిన పట్టింపు లేనట్టుగా మత పరమైన దురాక్రమణపై చర్యలు తీసుకోకుండా తీసుకోకుండా కల్లు మూసుకున్నట్టుగా అర్జీ వన్ యాజమాన్యం వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్చిలకు మసీదులకు మతపరమైన దర్గాలకు కబరస్థాన్ పేరుతో 100ల ఎకరాల స్థలాన్ని సింగరేణి కేటాయించిందని అవే కాకుండా మళ్లీ స్థలాలు కబ్జాలు చేస్తున్న సోయి లేనట్టుగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీఎం కార్యాలయానికి 100 మీటర్ల పరిధిలోని చుట్టూ నాలుగు చర్చిలలో పదుల సంఖ్యలో ఎకరాల స్థలం సింగరేణి క్వార్టర్లలో సైతం మతమార్పిడులకు అనుకూలంగా చిన్న చిన్న చర్చిలు ఏర్పాటు చేసిన పట్టించుకోవడంలేదని అన్నారు. హిందూ సంస్థలకు దేవాలయాలకు సంబంధించిన కేటాయించిన స్థలాలను చిన్న కట్టడాలు జరిపిన మూర్ఖంగా వ్యవహరించి అర్ధరాత్రి కూల్చివేసే సింగరేణి నగర నడిబొడ్డున కబ్జాలు జరిగిన కూడా చూస్తూ ఊరుకోవడం సిగ్గుచేటన్నారు. చర్చి మసీదుల పేరుతో స్థలాలు కబ్జా చేయించి సింగరేణి అధికారులే ఆర్థిక లావాదేవీలకు పన్నాగం పన్నుతున్నారా అనే సందేహం విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ హిందూ సమాజానికి కలుగుతుందని రానున్న రోజుల్లో పారిశ్రామిక ప్రాంతంలో జరిగే మత గొడవలకి సింగరేణి ప్రధాన బాధ్యత వహించాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు. అత్యల్ప సంఖ్యాకులుగా ఉన్న ముస్లిం, క్రిస్టియన్లకు వందల ఎకరాలు ఆనాడు దేశ భవిష్యత్తుకై సింగరేణి భవిష్యత్తుపై వందల ఎకరాలు, వేల ఎకరాలు కేటాయించిన హిందూ సమాజానికి మొండిచేయి చూపిస్తూ భూములను మత సంస్థలకు అప్పగిస్తున్న సింగరేణి రానున్న రోజుల్లో విశ్వహిందూ పరిషత్ ఉద్యమాల ఆగ్రహానికి గురికాక తప్పదని దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు ప్రస్తుతం సింగరేణి స్థలాలను కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని లేనిచో రానున్న రోజుల్లో గోదావరిఖని హిందూ సమాజాన్ని ఏకం చేసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం జీఎం కార్యాలయంలో అధికారులకు మెమోరాండం అందించారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ విభాగ కార్యదర్శి అయోధ్య రవీందర్, నగర కార్యదర్శి మునిగాల సంపత్, అడిగొప్పుల రాజు, బజరంగ్దళ్ జిల్లా సంయోజక్ సంపత్ యాదవ్, ఆరెల్లి జలంధర్, నేరేడుకొమ్ము వెంకటస్వామి, పైతరి రాజు, అనిరుద్, శివ, మోహన్,శ్రావణ్, శ్రీనివాస్, బాలు, రాజ్ కుమార్, శేఖర్, శివ, రమేష్, ప్రశాంత్, అజిత్, కార్తీక్, ప్రకాష్,తదితరులు అధిక సంఖ్యలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు

## గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాదరావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), మే 23: గంజాయి విక్రయించినా, సేవించినా చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాదరావు హెచ్చరించారు. గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 8 ఇంక్లైన్ కాలనీ,సిర్కే చౌరస్తా, ఆటోస్టాండ్, టీస్టాళ్లు, పాన్ షాపులు,ప్రభుత్వ హైస్కూల్ ప్రాంతం,కేకే నగర్‌తో పాటు ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాదరావు, నార్కోటిక్ ఇన్స్పెక్టర్ ఎం.రాజ్‌కుమార్, నార్కోటిక్ బృందం సంయుక్తంగా శనివారం జాగిలాలతో విస్తృత తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి,ఇతర మత్తు పదార్థాలను సేవించినా, విక్రయించినా,రవాణా చేసినా కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు లేదా డయల్-100కు సమాచారం అందించాలని కోరారు.ఈ తనిఖీల్లో గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాదరావు, నార్కోటిక్ వింగ్ ఇన్స్పెక్టర్ ఎం. రాజ్‌కుమార్, పెద్దపల్లి నార్కోటిక్ టీమ్ సిబ్బంది,డాగ్ స్క్వాడ్ సిబ్బంది,స్థానిక పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యులు కావాలి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 23 : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో బాగంగా జాతీయ హరితదళం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆద్వర్యంలో 99 రోజుల పాఠశాలల్లో పర్యావరణ అవగాహన కార్యక్రమాల నిర్వహణలో బాగంగా కెజిబివి మేడిపల్లిలో కొనసాగుతున్న వేసవి శిబిరంలో విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై గీతాలు ఆలపించి, నాటకం ప్రదర్శించారు. విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. జాతీయ హరితదళం జిల్లా కోఆర్డినేటర్, పర్యావరణ రాయబారి మచ్చ రాజశేఖర్ మాట్లాడుతూ..పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వాయుకాలుష్యం వల్ల ప్రజలకు ఆస్తమా, ఊపిరితిత్తుల వ్యాధులు వస్తున్నాయని, జలకాలుష్యం వల్ల తాగునీటి కొరత ఏర్పడుతుందని తెలిపారు. చెట్లను నరకడం వల్ల వర్షాలు తగ్గుముఖం పడుతున్నాయని, అలాగే ప్లాస్టిక్ వాడకం పెరిగిపోవడం వల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయన్నారు. పర్యావరణాన్ని రక్షించడంలో భాగంగా ప్రతి విద్యార్థి ఇంటి పరిసరాలలో మొక్కలు నాటి వాటిని పెంచాలని సూచించారు. విద్యార్థులందరూ తమ పుస్తకాలను, నోట్ బుక్ లను వృథా చేయవద్దని, పేపర్ తయారవుటకు చెట్లు ఉపయోగ పడుతున్నాయని, మీరు పేపర్ చించి వృథా చేయవద్దని, పర్యావరణం కాపాడటంలో మీరు పాల్గొనాలని విద్యార్థులకు తెలియజేశారు. చిత్రలేఖనం, నాటకం, సాంగ్స్ పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు, బహుమతులను జాతీయ హరిత దళం జగిత్యాల జిల్లా కోఆర్డినేటర్ మచ్చ రాజశేఖర్ అందించారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి కేజిబివి స్పెషల్ ఆఫీసర్ నిషాద్ సహెద, సంగీత, జ్యోతి, ఏంఐఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.



# మార్కండేయ దేవాలయ నిర్మాణానికి విరాళం అందజేత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 23 : మేడిపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ మార్కండేయ స్వామి దేవస్థానం నిర్మాణం కొరకు కట్లకుంట గ్రామానికి చెందిన శ్రీపతి శ్రీనివాస్ 1,25000 (లక్ష ఇరవైయిదువేలు) రూపాయలను శనివారం మేడిపల్లి మార్కండేయ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు, మేడిపల్లి సంఘ సభ్యులకు అందజేశారు. ఆలయానికి విరాళం అందించిన శ్రీపతి శ్రీనివాస్ కుటుంబసభ్యులకు ఆ మార్కండేయుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటూ కమిటీ సభ్యులు, సంఘ సభ్యులు శ్రీపతి శ్రీనివాస్ వారి కుమారునికి హరికృష్ణలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చేపూరి నాగరాజు, ప్రధాన కార్యదర్శి బండారి రమేష్, ఉపాధ్యక్షులు కుందెన సత్యనారాయణ, కోశాధికారి మేకల కిషోర్ కుమార్, సహాయ కార్యదర్శి పోతూ అశోక్, కార్యవర్గ సభ్యులు, పొట్ట వత్తిని రవి, చిరుమళ్ల వజ్రలింగం, వీరబత్తిని శ్రీనివాస్, మేడిపల్లి సంఘ అధ్యక్షులు మేకల రాజేశం, సంఘ సభ్యులు దీకొండ గంగాధర్, పోతు గణేష్, పోతు భూమన్న, కుందారపు హరే రాము, కట్టకుంటకు చెందిన కట్కం రవి, ఆడెపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం...

## కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు వంగ రవి యాదవ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 23 : రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం ఉంటుందని కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు వంగ రవి యాదవ్ అన్నారు.శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చాంద్ పాషా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ముఖ్య నాయకుల సమావేశానికి ముఖ్యఅతిథిగా వంగ రవి యాదవ్ హాజరై మాట్లాడుతూ జిల్లా లో రైతులకు అండగా ఉంటున్న ప్రజా ప్రభుత్వం పై బిఆర్ఎస్ పార్టీ నాయకులు రైతుల కోసం ధర్నాలు రాస్తారోకాలు చేయడం సిగ్గుచేటని,బీఆర్ఎస్ పార్టీ నాయకులను హెచ్చరించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులు వరి వేసుకుంటే ఊరే అని అన్నారని, దొడ్డు వడ్లు వేస్తే మేము రైతుల దగ్గర వడ్లు కొనమని చెప్పిందని, ఖమ్మం జిల్లాలో రైతులు అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం మీద ధర్నాలు చేస్తే వారిని అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపిన చరిత్ర మీ బిఆర్ఎస్ ప్రభుత్వం అని, నకిలీ విత్తనాలతో రైతులు మోసపోయి ఆత్మహత్యలు చేసుకుంటే ఏ రోజు కూడా అప్పటి ముఖ్యమంత్రి ఇప్పటి ప్రతిపక్ష నేత కేసిఆర్ రైతుల దగ్గరికి వెళ్లి వారి కుటుంబాలను ఆదుకొని పరామర్శించిన దాఖలాలు లేవని,తెలంగాణ రైతులు ఆత్మహత్యలతో చనిపోతే నష్టపరిహారం చెల్లించని కేసీఆర్ పంజాబ్ రైతుల కోసం పంజాబ్ రాష్ట్రానికి వెళ్లి ఈ రాష్ట్ర దనాన్ని వృధాగా అక్కడ రైతులకు అందించారని, రైతు పండించిన పంటకు మద్దతు ధర లేక అల్లాడిన చరిత్ర బి.ఆర్.ఎస్ ప్రభుత్వాన్ని కాని, ప్రజా ప్రభుత్వం వచ్చాక రైతుల కళ్ళలో ఆనందాలు విరవెలుస్తున్నాయని దానికి నిదర్శనమే 9 రోజులలో తొమ్మిది వేల కోట్ల రూపాయల రైతు భరోసా నిధులను ఏకకాలంలో వేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి అని, ప్రజా ప్రభుత్వం వచ్చాక రైతులకు సకాలంలో ఎరువులు, పంట విత్తనాలు అందుతున్నాయని,పండించిన రైతుకు సన్నబడ్లకు 500 రూపాయల బోనస్ డబ్బులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లిస్తుందని,ఆనాడు మీ ప్రభుత్వంలో రైతులు పండించిన పంట అమ్ముకున్నాక డబ్బులు రావాలంటే రెండు నెలలు బ్యాంకుల చుట్టూ పడికాపులు కాస్తూ తిరిగేవారని,కాని ప్రజా ప్రభుత్వం వచ్చాక పండించిన పంటను రైతు అమ్ముకున్నాక కేవలం 48 గంటలలోనే రైతుల డబ్బులు జమ అవుతున్నాయని అన్నారు.ఇప్పటికైనా బిఆర్ఎస్ నాయకులు ధర్నాలు రాస్తారోకాలు చేసి విలువలు తీసుకోవద్దని,కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిలో పాలుపంచుకోవాలని బిఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు.



# బస్వాపూర్ బాధితులకు సిఎం భరోసా

**- ఆర్ అండ్ ఆర్ కాలనీ అభివృద్ధికి త్వరలో నిధులు**

**- సిఎం రేవంత్ రెడ్డి హామీ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మే 23 : సిఎం రేవంత్ రెడ్డిని బీఎన్ తిమ్మాపురం సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి కలిసి గ్రామ నిర్వాసితుల సమస్యలను వివరించారు. యాదాద్రి పర్యటనకు వచ్చిన ముఖ్య మంత్రిని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనీల్ కుమార్ రెడ్డితో కలిసిన సందర్భంగా వినతిపత్రం అందజేశారు. బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణంతో బీఎన్ తిమ్మాపురం గ్రామ ప్రజలు పంట భూములతో పాటు నివాస గృహాలను కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ తెలిపారు. ఆర్అండ్ఆర్ కాలనీ అభివృద్ధి, ఇళ్ల నష్టపరిహారం కోసం రూ.134 కోట్లు మంజూరు చేయాలని కోరారు. కొత్త ఆర్అండ్ఆర్ కాలనీలో రోడ్లు, మంచినీరు, డ్రైనేజీ, పాఠశాల భవనాలు తదితరమౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి నష్టపరిహారం త్వరలో విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి వెల్లడించారు. ఈసమస్య పరిష్కారానికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనీల్ కుమార్ రెడ్డికి గ్రామప్రజలతరపున ప్రత్యేకకృతజ్ఞతలు తెలిపారు.



# కొటారి గ్రామంలో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 23 : జూన్ 2న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో కెరమెరి మండలం కొరారి గ్రామ పంచాయతీ ఫరిదిలోని కొత్తగూడ గ్రామంలో జిల్లా ఎస్పీ నితికా పంత్, జిల్లా అదనపు కలెక్టర్ యువరాజు మార్మాట్ సంబంధిత అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమ స్థలాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియం త్రణపై అధికారులకు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి రాక దృష్ట్యా ఏర్పాటు చేయనున్న హెలిప్యాడ్ ప్రాంతాన్ని కూడా పరిశీలించి భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని ఆదేశిం చారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ స్థలాలు, రహ దారుల మరమ్మతులు, తాగునీరు, విద్యుత్, బారికేడింగ్, ట్రాఫిక్ మళ్లింపు వంటి అంశాలపై శాఖల మధ్య సమన్వయంతో పనిచేయా లని సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందు కు అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ పర్యట నలో ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్‌తో పాటు పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖల అధికారులు పాల్గొన్నారు.



# వనపర్తి బీఆర్ఎస్ పార్టీ బూత్ లెవెల్

**- ఏజెంట్ల జాబితా ఆర్డీవోకు అందజేత**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి,మే, 23 : వచ్చే జూన్ నెలలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదేశాలనుసారం వనపర్తి నియోజకవర్గం లోని వివిధ మండలాలు, మున్సిపాలిటీలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాలను సిద్ధం చేసి ఆర్డీవోకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లా డుతూ.. అన్ని గ్రామాలు, వార్డుల నుంచి దీూాల జాబితాలను యుద్ధప్రాతిపదికన సేకరించి ఇతర రాజకీయ పార్టీల కంటే ముందుగానే పూర్తి స్థాయిలో సమర్పించడం హర్షణీయమని తెలి పారు. ఈ కార్యక్రమానికి సహకరించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాణిక్యం, రాళ్ల కృష్ణయ్య, వేణు యాదవ్, ధర్మానాయక్, వెంకట్ సాగర్, జమీల్ అహమ్మద్, చిట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన గోపాల్‌పేట నూతన ఎస్సై శశిధర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి,మే, 23 : వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని గోపాల్ పేట నూతన ఎస్సై శశిధర్, ఏదుట్ల గ్రామ సర్పంచ్ సునీత రాజవర్ధన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గోపాల్‌పేట మండలంలో శాంతి భద్రతల పరి రక్షణ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించే అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీస్ శాఖ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం నూతన బాధ్యతలు స్వీకరించిన ఎస్సై శశిధర్ కి ఎమ్మెల్యే అభినందనలు తెలియజేసి, విధుల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేయాలి

**ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి, మే 23 : వనపర్తి పట్టణంలోని శ్రీనివాసపూర్‌లో నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా సమాఖ్య భవన పనులను నాణ్యతతో పాటు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఎమ్మెల్యే నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలించారు. శ్రీనివాసపూర్‌లో రూ. 7.50 కోట్ల వ్యయంతో ఈ భవనం నిర్మాణం జరుగుతుండగా, ఇప్పటికే రూ. 5 కోట్లు మంజూరు కాగా అదనంగా మరో రూ. 2.50 కోట్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్ భవన నిర్మాణానికి సంబంధించిన ఇంజినీరింగ్ మ్యాప్‌ను పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. భవనం వద్ద నీరు నిల్వ కాకుండా సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, కాంపౌండ్ వాల్ మరియు ఎలివేషన్ పనులను ఆకర్షణీయంగా, నాణ్యతతో చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచిం చారు. భవన నిర్మాణం కారణంగా ప్రభావితమవుతున్న కుటుంబాలకు ఇంటి స్థలాలు అందజేస్తామని ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి హామీ ఇచ్చారు. అలాగే నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వెంకటయ్య యాదవ్, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య రవి యాదవ్, ఎల్ఐసి కృష్ణ, పంచాయతీ రాజ్ ఈఈ విజయ్ మోహన్, డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ భాస్కర్, తహసీల్దార్ రమేష్ రెడ్డి, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ మేళాల ద్వారా నిరుద్యోగులు ఉపాది పొందాలి : కలెక్టర్ కె హరిత



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 23 : జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగ మేళాలను సద్వినియోగం చేసుకొని ఉపాది అవకాశాలు మేరు పర్చు కోవాలని కలెక్టర్ కె.హరిత అన్నారు శనివారం సమీకృత సమావేశ మందిరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమములో భాగంగా యువజన, క్రీడల శాఖ అద్వార్యములో యువజన వారోత్సవాల కార్యక్రమానికి కలెక్టర్ పాల్గొన్నారు ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగ మేళాలను సద్వినియోగశీ చేసుకొని ఉపాది అవకాశాలను మెరుగు పర్చుకోవాలన్నారు పలు కార్పోరేట్ కంపెనీలు ఆకర్షిణమయైన జీతాలు అందిస్తున్నాయని అన్నారు మే 5 న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాబ్ మేళాలో ఆసిఫాబాద్ జిల్లా నుండి 11 మంది నిరుద్యోగ యువతీ యువకులు ఎంపిక అయ్యారని అన్నారు యువజన వారోత్సవాలలో భాగంగా మే-18 నుండి మే-23 వరకు రోజుకో కార్యక్రమము నిర్వహించడం జరిగిందన్నారు ఈ నెల 21న క్రీడాదినోత్సవము రోజున క్రీడాకారులకు ఆటలపోటీలు నిర్వహించడము జరిగిందని ఈ సందర్బంగా ఉద్యోగా మేళాలో ఉద్యోగాలు సాధించిన 11 మందికి నియామక పత్రాలను, క్రిడాపోటిలలో పాల్గొన్న వారికి షీల్డ్ తో పాటు ప్రశంశ పత్రాలు అందజేశారు ఈ కార్యక్రమములో జిల్లా యువజన మరియు క్రిడాల శాఖా అధికారి అప్షక్ అహ్మద్ జిల్లా ఇండిస్టియల్ మేనజర్ అశోక్ ,వ్యాయమ ఉపాద్యాయులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# కోర్టు డ్యూటీ అధికారులు సమర్థవంతంగా పని చేయాలి

**- జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా సూచన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే 23 : నిందితులకు శిక్షలు పడేలా కోర్టు డ్యూటీ అధికారులు సమర్థవంతంగా పని చేయాలని జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా సూచించారు. వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా ఆధ్వర్యంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, డీసీఆర్బీ అధికారులు, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఆదేశాల మేరకు ఈ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. నిందితులకు కోర్టుల్లో తప్పనిసరిగా శిక్షలు పడినప్పుడే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని అన్నారు. కేసులు పెండింగ్‌లో ఉండకుండా కోర్టు డ్యూటీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎఫ్ఐఆర్ నమోదైనప్పటి నుంచి కేసు పూర్తయ్యే వరకు అవసరమైన సాక్ష్యాలు, పత్రాలు, సాక్షుల వాంగ్మూలాలు సమయానికి కోర్టుకు చేరేలా చూడాలని తెలిపారు. సాక్షులు, బాధితులను సమయానికి కోర్టుకు హాజరు పరచడంతో పాటు కేసు పురోగతిపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. కోర్టు సమాచారం, ప్రాసిక్యూషన్‌కు



సంబంధించిన అంశాలను సంబంధిత ఎస్సైలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్ల (చీదీఔం), సమన్ల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టి త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మాట్లాడుతూ.. పోలీసు శాఖ, ప్రాసిక్యూషన్ విభాగం సమన్వయంతో పనిచేస్తేనే కేసుల్లో శిక్షల శాతం పెరుగుతుందని తెలిపారు. కేసులకు సంబంధించిన పత్రాలు, సాక్ష్యాలు, సాక్షుల హాజరు విషయంలో ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ నాయక్, డీసీఆర్బీ ఎస్సై తిరుపతి రెడ్డి, ఐటీ కోర్ సిబ్బంది గోవింద్, రవీందర్ బాబు, వెంకటన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కోమటిరెడ్డి జన్మదిన సందర్భంగా పేద రోగులకు పండ్ల పంపిణీ

**కార్యక్రమంలో పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మే 22 : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జన్మదిన సందర్భంగా పేద రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 23వ వార్డు మాజీ కౌన్సిలర్ పడిగెల రేణుక-ప్రదీప్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోత్నక్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జననం తెలంగాణ పేద ప్రజలకు వరమని పేర్కొన్నారు. గత 35 ఏళ్లుగా యువజన కాంగ్రెస్ నాయకునిగా రాజకీయాల్లో ఎదిగి, ప్రత్యేక తెలంగాణ సాధన కోసం తన మంత్రి పదవికి రాజీనామా చేసి ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు, యువతకు అండగా నిలుస్తూ ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆయురారోగ్యాలతో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సేవాదళ్ అధ్యక్షుడు డాకూరి ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిఎం ప్రకటించిన వేతనాలు కార్మికులకు సరిపోవు

**టియుసిఐ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు తోకల రమేష్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్ సిటి (గోదావరిఖని), మే 23 : ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గోదావరిఖని యూనియన్ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టియుసిఐ అధ్యక్షులు తోకల రమేష్ హాజరై మాట్లాడుతూ కోటి 11 లక్షల మంది కార్మికులకు వేతనాలు పెంచుతున్నానంటూ సి.ఎం. ప్రకటించారని అన్నారు. 2021లో బేసిక్ వేతనం 18000గా నిర్ణయించారని అన్నారు. ఈ వేతనాలు కార్మికులకు సరిపోవని ఆయన అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి దానిని తుంగలో తొక్కారని వాటి బేసిక్ వేతనం పట్ల మాట్లాడకుండా, కొత్త ప్రతిపాదనలతో ముందుకు రావడం అనేక అనుమానాలకు దారి తీస్తుందన్నారు. బేసిక్ వేతనాన్ని పెంచకుండా, వీడిఏకు సంబంధించినది ప్రకటన లేకుండా ఏక మొత్తంగా జీతాల పెంపకం ప్రకటించడంలో స్పష్టత లేదన్నారు. సిఎం చూపించిన వేతనాలు ఏ రంగ కార్మికులకు వస్తున్నాయనేది కూడా చెప్పకుండా, వాటి మీద ఎక్కువ మొత్తంలో జీతాలు పెంచుతున్నట్టు ప్రకటించడం హాస్యాస్పదం అని అన్నారు. ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ జీవో 11 ప్రకారం నేడు అన్‌స్కిల్ 13,098, సెమి స్కిల్‌కు-14,287, స్కిల్డ్‌కు-15,476, హైలీ స్కిల్డ్‌కు-23,683 ప్రస్తుతం చెల్లిస్తున్నదన్నారు. ముఖ్యమంత్రి ప్రకటించిన దాంట్లో రూ.20 వేలుగా ప్రకటించారని. దీనితో రూ.23,683 వస్తున్నా హైలీ స్కిల్డ్కు 3,683లు కోత విధించారని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో చేస్తున్న అన్ని ప్రాంతాల్లో అవుట్ సోర్స్, కాంట్రాక్టు ఉద్యోగులకి ఒకే వేతనం వారికి అమలు అవుతుందన్నారు. కార్మిక సంఘాల డిమాండ్ శాస్త్రీయంగా, సహేతుకంగా ఉన్నదని వేతనాల పెంపుదలకు డాక్టర్ ఆక్రాయిడ్ సూత్ర ఆధారంగా జీతాలు పెంచాలని టీయుసీఐ కోరుతున్నదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్స్ ఉద్యోగుల వేతనాల పెంపును (జి వో 60) రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపల్లి చంద్రయ్య, ఆడేపు శంకర్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుమ్మడి వెంకన్న, ధర్మాజీ నరసయ్య, రాజయ్య, యాదయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# రామగుండం అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, మే 23 : రామగుండం నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ కళాశాల నిర్మాణం, మున్సిపల్ రోడ్లు, డ్రెయినేజీ పనులు, రెవెన్యూ, ఆర్ అండ్ బి పంచాయతీరాజ్ శాఖల అభివృద్ధి కార్యక్రమాలు, 2 బిహెచ్‌కే గృహ నిర్మాణాల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. పనులు నిర్దేశిత గడువులో పూర్తి అయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని, జాప్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనుల అమలులో సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకు రావాలని, నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ శాఖల మధ్య సమన్వయం తో పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు సురేష్, బి.గంగయ్య, సీపీవో రవీందర్, ఈఈ పీఆర్, ఆర్ అండ్ బి ఈఈ భావ్‌సింగ్‌తో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# కుమారుని స్మృతిలో అన్నదానం

**ఆదర్శంగా నిలిచిన రామిల్ల కుటుంబం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 23 : కరోనా కారణంగా వారం రోజుల వ్యవధిలో ఇద్దరు కుమారులను కోల్పోయిన గోదావరిఖని మార్కండేయ కాలనీకి చెందిన రామిల్ల రామలింగం-మంగళ దంపతులు గత ఐదు సంవత్సరాలుగా వారి జ్ఞాపకార్థం సమాజహిత కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. శనివారం తమ కుమారుడు శైలేంద్రకుమార్ ఐదవ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక ఫైవ్ ఇంక్లైన్ ఏరియాలోని అమ్మ పరివార్ ఆశ్రమంలో నిరాశ్రయులకు అన్నదానం చేసారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తీవ్ర విషాదాన్ని తట్టుకొని సేవా కార్యక్రమాలు చేపడుతున్న రామిల్ల దంపతుల సేవాభావం అభినందనీయమన్నారు. సమాజంలోని దాతలు కూడా వీరిని ఆదర్శంగా తీసుకొని నిరాశ్రయులను ఆదుకోవడానికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామిల్ల కుటుంబ సభ్యులు శైలజ, వైష్ణవి, వణుష్ణ, రాజేంద్రకుమార్, జ్యోతి, విశ్వజిత్, నిత్యసాయి, మహేంద్ర కుమార్, సుప్రియ, కృతిక్, రవీంద్రకుమార్, గురుపాదం, మిత్రులు మేజిక్ రాజా, మేజిక్ హరి, చంద్రపాల్,ఆశ్రమనిర్వాహకులు నాగరాజు,కరణ్ పాల్గొన్నారు.



# జన గణనకు అందరూ సహకరించాలి

**- జోనల్ కమిషనర్ నారాయన్ అమిత్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

శేరిలింగంపల్లి మే 23 : జన గణనకు అందరూ సహకరించాలని జోనల్ కమిషనర్ నారాయన్ అమిత్ పేర్కొన్నారు. శనివారం సెంట్రల్ సెన్సస్ బృందంతో పాటు జోనల్ కమిషనర్, శేరిలింగంపల్లి జోన్, డిప్యూటీ కమిషనర్‌తో కలిసి ఖాజాగూడలోని జైన్స్ కార్టన్ క్రీక్ అపార్ట్‌మెంట్‌ను సందర్శించారు. జరుగుతున్న జనగణన కార్యకలాపాలను సమీక్షించి, క్షేత్రస్థాయి ఎన్యూమరేషన్ ప్రక్రియను పరిశీలించారు. జనగణన విజయవంతంగా అమలు కావడానికి ఖచ్చితమైన, పారదర్శకమైన, సమగ్రమైన డేటా సేకరణ ఆవశ్యకతను ఈ సందర్భంగా అధికారులు నొక్కి చెప్పారు. ఇంటింటి సర్వేలో పాల్గొంటున్న సిబ్బందితో మాట్లాడి, ఎదురవుతున్న సవాళ్లను అడిగి తెలుసుకున్నారు. ప్రజలందరూ జనగణన ప్రక్రియలో సహకరించి, సరైన సమాచారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



# ఆదిమ గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం జనభాగీదారి అభియాన్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 23 : పీఎం జన్ మన్ కార్యక్రమం ద్వారా ఆదిమ గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం జనభాగీదారి అభియాన్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి తెలిపారు. ఈ పథకాన్ని ఆదిమ గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్య క్రమం ద్వారా వ్యక్తిగత సామూహిక అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. శనివారం జైనూర్ మండలం రాసిమెట్ట గ్రామపంచాయతీ మంగూగూడ గ్రామంలో జనభాగీదారి అభియాన్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థు లకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించ డంతో పాటు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారు లకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో ఏటీడిఓ, ఎస్ సి ఆర్ పి ఉయిక శంకర్, చౌహాన్ రవీందర్, ఉపాధ్యాయులు విజేందర్, ఉత్తమ్, భీంరావ్ సాంబాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సింగరేణి డైరెక్టర్ గౌతమ్ పొట్రుకు అదనపు బాధ్యతలు

## ఐటీ, ఈఆర్‌పీ విభాగాలు అప్పగింత



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 22 : సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రుకు సంస్థలో అదనపు బాధ్యతలను అప్పగిస్తూ యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయం నుండి శుక్రవారం ఒక అధికారిక ఉత్తర్వు జారీ అయింది. గతంలో (16.06.2025 న) జారీ చేసిన ఉత్తర్వులకు కొనసాగింపుగా, సంస్థ పరిపాలన మరియు సాంకేతికతను మరింత బలోపేతం చేసే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తక్షణమే అమలులోకి వచ్చేలా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎంటర్‌ప్రైజ్ రీసోర్స్ ప్లానింగ్ కీలక విభాగాలను గౌతమ్ పొట్రుకు అప్పగించారు. సంస్థలో సాంకేతిక విప్లవానికి, పారదర్శకమైన యాజమాన్య నిర్వహణకు అత్యంత కీలకమైన ఈ రెండు విభాగాల బాధ్యతలను ఐఏఎస్ అధికారి అయిన గౌతమ్ పొట్రుకు అప్పగించడం ద్వారా సింగరేణి డిజిటలైజేషన్ ప్రక్రియ మరింత వేగవంతం కానుంది.

# కాళేశ్వరం మ్యూజియంలో ఆకట్టుకుంటున్న శిలా సంపద

## మత్స్య, కూర్మ అవతార శిల్పాలు ప్రత్యేక ఆకర్షణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 23: దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన కాళేశ్వరం క్షేత్రం ఆధ్యాత్మికతతో పాటు విశిష్ట శిల్ప సంపదకు కూడా నిలయంగా నిలుస్తోంది. ముఖ్యంగా శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవాలయ సమీపంలో ఏర్పాటు చేసిన మ్యూజియంలో ప్రదర్శిస్తున్న పురాతన శిల్పాలు భక్తులను, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. విష్ణుమూర్తి దశావతార శిల్పాలలో మత్స్య, కూర్మ అవతారాల శిల్పాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుండగా, అన్నపూర్ణాదేవి విగ్రహం, శైవ ద్వారపాలకులు, మత్స్యయంత్రాన్ని లక్ష్యంగా చేసుకున్న అర్జునుడు, చతుర్ముఖ లింగం వంటి శిల్పాలు కూడా సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ శిల్పాలు రాష్ట్రకూటులు, వేములవాడ చాళుక్యులు, కళ్యాణి చాళుక్యులు, కాకతీయుల కాలాలకు చెందినవిగా పురావస్తు నిపుణులు భావిస్తున్నారు. ఎర్రరాయి, గ్రానైట్, బసాల్ట్ రాళ్లతో చెక్కబడిన ఈ శిల్ప సంపదను భద్రపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.20 కోట్ల వ్యయంతో ఆధునిక మ్యూజియంను ఏర్పాటు చేసింది. సరస్వతి అంత్య పుష్కరాల ప్రారంభ సందర్భంగా ఈ నెల 21న రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దంపతులతో పాటు జగద్గురువు శంకర విజయేంద్ర సరస్వతి , రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీదర్ బాబు, చేతుల మీదుగా మ్యూజియం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ధార్మిక సలహాదారు గోవింద హరి,



దేవాలయ చైర్మన్ మోహన్ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక, చారిత్రక అంశాలను ప్రతిబింబించేలా రూపుదిద్దుకున్న ఈ మ్యూజియాన్ని ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో భక్తులు సందర్శిస్తున్నారు. ముఖ్యంగా శతాబ్దాల నాటి శిల్పాలు, పురాతన విగ్రహాలు, వాటికి సంబంధించిన వివరణలు సందర్శకులకు ప్రత్యేక అనుభూతిని కలిగిస్తున్నాయి. సందర్శకుల సౌకర్యార్థం మ్యూజియం వద్ద తగిన ఏర్పాట్లు చేసినట్లు పురావస్తు శాఖ సహాయ సంచాలకులు మాధవి తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని, మ్యూజియం సందర్శన ద్వారా భక్తులు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు చారిత్రక అవగాహన కూడా పొందుతున్నారని ఆమె పేర్కొన్నారు.

# కాళేశ్వరంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మహామండలేశ్వర ఆచార్య సంవిదానంద సరస్వతి మహారాజ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 23:సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారి ఆలయాన్ని నాసిక్‌కు చెందిన మహామండలేశ్వర ఆచార్య సంవిదానంద సరస్వతి మహారాజ్ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సరస్వతి నదిలో పుణ్యస్నానం ఆచరించిన అనంతరం ఆలయానికి చేరుకున్న మహారాజ్‌కు ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేక దర్శనం చేసుకున్నారతదుపరి పార్వతి (శుభానంద) దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మహా సరస్వతి అమ్మవారిని కూడా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆశీర్వచన మండపంలో భక్తులను ఉద్దేశించి ఆచార్య సంవిదానంద సరస్వతి మహారాజ్ ధార్మిక సందేశం అందించి ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు స్వామివారి శేష వస్త్రాలను మహారాజ్‌కు ఘనంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ శర్మ, ఆర్జేసీ రామకృష్ణ, ఈవో మహేష్, ఆలయ అధికారులు, వేద పండితులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉల్వనూరు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారం రాథోడ్

## - విధులకు గైర్హాజరైన డాక్టర్, సిబ్బందికి మెమోలు - రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యంపై అధికారుల ఆగ్రహం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 23:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని ఉల్వనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విధులకు గైర్హాజరైన వైద్యుడు దేవేందర్‌తో పాటు హెల్త్ సూపర్వైజర్ భీమ్‌సింగ్, సీనియర్ అసిస్టెంట్ బుచ్చయ్యలకు మెమోలు జారీ చేశారుమందుల నిల్వల రిజిస్టర్‌ను సక్రమంగా అప్డేట్ చేయకపోవడంపై ఫార్మసీ ఆఫీసర్ రోజా రమణిపై డీఎంహెచ్ఓ ఆగ్రహం వ్యక్తం చేసి మెమో జారీ చేశారు. అలాగే రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన నర్సింగ్ ఆఫీసర్ సంధ్యారాణికీ మెమో అందజేశారు. పీహెచ్‌సీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి నెల మూడవ గురువారం శ్రమదానం, సమిష్టి భోజన కార్యక్రమాలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఫార్మసీ, ల్యాబొరేటరీ, వార్డులు, లేబర్ రూమ్‌లను పరిశీలించిన ఆయన అత్యవసర మందుల నిల్వలను బోర్డుపై స్పష్టంగా ప్రదర్శించాలని ఫార్మసిస్ట్ రోజా రమణికి ఆదేశించారు. పాముకాటు, తేలు కాటు, కుక్కకాటు చికిత్సకు అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా సమృద్ధిగా నిల్వ చేయాలని సూచించారు. చిన్నపిల్లలకు అందించే వ్యాక్సిన్ నిల్వలపై కూడా ఆయన ఆరా తీశారు. అనంతరం కారేగట్టు గ్రామంలో నిర్వహిస్తున్న రొటీన్ ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని తనిఖీ చేసి గర్భిణీలకు అందిస్తున్న వైద్య సేవలపై వాకబు చేశారు. గర్భిణీలు రక్తహీనత నివారణకు సమతుల ఆహారం తీసుకోవడంతో పాటు యోగా, తేలికపాటి వ్యాయామాలు చేయాలని సూచించారు. క్రమం తప్పకుండా వైద్యుల పర్యవేక్షణలో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని అవగాహన కల్పించారు. వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యతపై తల్లిదండ్రులకు పూర్తి వివరాలు తెలియజేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో ఎంఎల్‌హెచ్‌పీలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సేవలందించాలని, ప్రతిరోజూ హెల్త్ అండ్ వెల్నెస్ కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఉల్వనూరు పీహెచ్‌సీలోని 108 అంబులెన్స్‌లో ఉన్న మందులు, ఆక్సిజన్ సిలిండర్లు, బీపీ పరికరాలు తదితర వైద్య సామగ్రిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రతాప్, హెచ్ఈఓ రాంప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ వినయ్ కుమార్, హెచ్‌వీ సడాలదేవి, జ్యోతి, సంధ్యారాణి, రోజా రమణి తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతి అంత్య పుష్కరాలకు మిషన్ భగీరథ విశేష సేవలు

## భక్తులకు తాగునీరు, పారిశుధ్య సదుపాయాల విస్తృత ఏర్పాటు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 23:సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మిషన్ భగీరథ విభాగం విస్తృత స్థాయిలో తాగునీరు, పారిశుధ్య సదుపాయాలను కల్పిస్తోంది. పుష్కర ఘాట్లకు భారీగా తరలివస్తున్న భక్తులకు స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన వాతావరణం అందించేందుకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రత్యేక చర్యలు చేపట్టారు. పుష్కరాల సందర్భంగా మొత్తం 540 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయగా, భక్తులకు నిరంతర తాగునీటి సరఫరా కోసం 38 నీటి పంపిణీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. తాత్కాలిక, శాశ్వత మరుగుదొడ్ల పరిశుభ్రత నిర్వహణ కోసం 115 మంది స్కావెంజర్లు నిరంతరం సేవలందిస్తున్నారు. టెంట్ సిటీతో పాటు పుష్కర ప్రాంతాల్లోని మరుగుదొడ్ల వ్యర్థాలను తొలగించేందుకు 8 గల్పర్ యంత్రాలను వినియోగంలోకి తీసుకువచ్చారు. అదేవిధంగా భక్తులకు ఎప్పటికప్పుడు తాగునీరు అందించేందుకు 5 నీటి ట్యాంకర్ల ద్వారా సరఫరా కొనసాగిస్తున్నారు. నీటి నాణ్యతను కాపాడేందుకు క్లోరినేషన్ ప్రక్రియను అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేస్తున్నారు. ఈ సేవలను సమర్థవంతంగా నిర్వహించేందుకు మిషన్ భగీరథ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారు. చీఫ్ ఇంజినీర్ కె. సురేష్ పర్యవేక్షణలో సూపరింటెండింగ్ ఇంజినీర్ చలమల రెడ్డి, ఈఈలు స్వేత, మాణిక్యరావు, డీఈఈలు పి. రమేష్, కిరణ్, సంధ్యారాణి, 15 మంది ఏఈలు/ఏఈఈలు,



6 మంది ల్యాబ్ సిబ్బంది, 30 మంది హెల్పర్లు, అలాగే ఏజెన్సీకి చెందిన 120 మంది నీటి సరఫరా సిబ్బంది సేవలందిస్తున్నారు. పుష్కరాల సందర్భంగా భక్తులకు స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన పారిశుధ్య సదుపాయాలు అందించడమే లక్ష్యంగా మిషన్ భగీరథ విభాగం కట్టుదిట్టమైన ఏర్పాట్లతో సేవలను నిరంతరం కొనసాగిస్తోంది.

# జాబ్ మేళాలో ఎంపికైన నిరుద్యోగులకు నియామక పత్రాల జారీ

## క్రీడా పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 23:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో శనివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 21న నిర్వహించిన క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థి, విద్యార్థినులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. సుమారు 45 మంది క్రీడాకారులను ఈ సందర్భంగా సన్మానించారు. అదేవిధంగా ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన జాబ్ మేళాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నిరుద్యోగ యువతకు పలు ప్రముఖ కంపెనీల నుంచి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి మొత్తం 43 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికై నియామక పత్రాలు పొందినట్లు అధికారులు తెలిపారు. ఇక జిల్లా టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "క్లీన్ డే" కార్యక్రమంలో భాగంగా కోటగుళ్ల ప్రాంతంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులతో పాటు ఆర్కియాలజీ డైరెక్టర్ బుజ్జి, సెక్యూరిటీ రాజు, సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ విషయాన్ని జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

# పాల్వంచలో వీఓఏల నిరవధిక సమ్మె

## - "పని మాత్రం మాతోనే.. గుర్తింపు మాత్రం శూన్యం" అంటూ ఆవేదన

## - సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 23:తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఐకేపీ వీఓఏల జేఏసీ ఆధ్వర్యంలో వీఓఏలు నిరవధిక సమ్మెకు దిగారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వీఓఏలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "గ్రామాల్లో పని అంతా మాతోనే చేయించుకుంటారు.. కానీ మా సమస్యలను మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు" అంటూ వీఓఏలు ఆవేదన వ్యక్తం చేశారు. బతకలేని వేతనాలతో కుటుంబాలను పోషించడం కష్టంగా మారిందని, తమ జీవన పరిస్థితులు దయనీయంగా మారాయని వాపోయారు. మహిళా సంఘాల బలోపేతం నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వరకు ప్రతి కార్యక్రమంలో ముందుండే తమకు కనీస గుర్తింపు కూడా దక్కడం లేదని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్నప్పటికీ కనీస వేతనం కూడా అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. వెంటనే వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించడం ప్రభుత్వానికి అలవాటైందని మండిపడ్డారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షురాలు అనురాధ, కార్యదర్శి రమేష్, జ్యోతి, సుమలత, సుజాత, మీనా, కల్పన, మౌనిక కుమారి, తార, అనూష, శైలజ, రమణ, కృష్ణవేణి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# రూ.5 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పాయం శంకుస్థాపనలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 23:భద్రాద్రి జిల్లా పినపాక నియోజకవర్గంలోని మణుగూరు మున్సిపాలిటీ, మండల పరిధిలో సుమారు రూ.5 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శంకుస్థాపనలు చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, పినపాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. అన్నారం బైపాస్ రోడ్డులో రూ.43 లక్షలు, శాంతినగర్‌లో రూ.23 లక్షలు, కోటకట్టలో రూ.47 లక్షలు, పాత మణుగూరులో రూ.42 లక్షలు, గాంధీబొమ్మ సెంటర్‌లో రూ.48 లక్షలు, మంగళకట్టలో రూ.47 లక్షలతో సైడ్ డ్రైన్ నిర్మాణ పనులు, అలాగే నాయుడు కుంటలో రూ.2.50 కోట్లతో పూడికతీత, అభివృద్ధి పనులను ప్రారంభించారు. డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించడం, నాయుడు కుంట అభివృద్ధితో నీటి నిల్వ సామర్థ్యం పెంచడం లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ పావని, వర్క్ ఇన్‌స్పెక్టర్ అనిల్, మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు శివ సైదులు, బానోత్ లక్ష్మణ్, 14 టైర్ అధ్యక్షులు దుగ్గంపూడి ఈశ్వర్ రెడ్డి, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, పాతూరు వెంకన్న, నీరుడు రాంబాబు, కురం రవి, తుపూడి శ్రీను, జర్పుల జగన్, దొడ్డపునేని మధు, తాత ప్రసాద్, తమ్మిశెట్టి సాంబ, ఆముదాల శ్యామల, వేముల స్వరూప, బత్తుల శ్రీను, పళ్లెం నగేష్, మోదం ముత్యాలరావు, కట్ట నరసింహాతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

## సింగరేణి వేసవి క్రీడా శిక్షణ శిబిరం విజయవంతం




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 23:సింగరేణి కాలరీస్ యాజమాన్యం ఆధ్వర్యంలో భద్రాద్రి జిల్లా మణుగూరు ఏరియా పీవీ కాలనీలోని భద్రాద్రి స్టేడియంలో గత నెల 28వ తేదీ నుంచి నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరం శుక్రవారం రాత్రితో విజయవంతంగా ముగిసింది. సింగరేణి ఉద్యోగుల 18 సంవత్సరాల లోపు బాలబాలికల కోసం నిర్వహించిన ఈ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఏరియా ఎస్ఓటు జీఎం బి. శ్రీనివాస చారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచే పిల్లల్లో చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించడం ద్వారా ఉత్సాహం, చురుకుదనం, పట్టుదల పెరుగుతాయని అన్నారు. వేసవి సెలవుల్లో పిల్లలు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ తమలోని క్రీడా ప్రతిభను మెరుగుపరుచుకునేందుకు సింగరేణి యాజమాన్యం ప్రతి సంవత్సరం ఉచితంగా శిక్షణ అందిస్తోందని తెలిపారు. పిల్లల ఆసక్తికి అనుగుణంగా ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, వాలీబాల్, కరాటే, బాస్కెట్‌బాల్ విభాగాల్లో అనుభవజ్ఞులైన శిక్షకులతో ప్రత్యేక శిక్షణ అందించామని పేర్కొన్నారు. ఈ ఏడాది కూడా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పెద్ద సంఖ్యలో బాలబాలికలు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. ఇక్కడ నేర్చుకున్న క్రీడలను భవిష్యత్తులోనూ సాధన చేస్తూ ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కరాటే విభాగంలో శిక్షణ పొందిన బాలబాలికలు ప్రదర్శించిన సాహసోపేతమైన డెమోలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం నెల రోజుల పాటు శిక్షణలో చురుగ్గా పాల్గొన్న బాలబాలికలకు ముఖ్య అతిథి బి. శ్రీనివాస చారి గుర్తింపు సంఘం, ప్రాతినిధ్య సంఘం నాయకులతో కలిసి స్పోర్ట్స్ యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, ఫైనాన్స్ మేనేజర్ పి. రమేశ్, గుర్తింపు సంఘం నాయకులు మేకల ఈశ్వర్, ప్రాతినిధ్య సంఘం వైస్ ప్రెసిడెంట్ వి. కృష్ణంరాజు, డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ గౌరవ కార్యదర్శి డి. నరేశ్, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ సిహెచ్. వెంకటేశ్వరరావు, క్రీడా శిక్షకులు, సింగరేణి ఉద్యోగులు, తల్లిదండ్రులు, బాలబాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పవిత్ర స్నానాలు గుర్తించిన ఘాట్ల వద్దనే ఆచరించాలి

## భక్తులకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కాటారం, మే 23:సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా పుష్కర ఘాట్లకు భారీగా తరలివస్తున్న భక్తులు తప్పనిసరిగా అధికారికంగా గుర్తించిన ఘాట్ల వద్దనే పవిత్ర స్నానాలు ఆచరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. గుర్తించని ఇతర ప్రాంతాల్లో నదిలో స్నానాలు చేయడం ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. నదిలో నీటి ప్రవాహం, లోతు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని భద్రతా ఏర్పాట్లు చేసిన పుష్కర ఘాట్లను మాత్రమే వినియోగించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. భక్తుల ప్రాణ భద్రత దృష్ట్యా జిల్లా యంత్రాంగం జారీ చేస్తున్న సూచనలు, సలహాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఇప్పటికే ఘాట్ల వద్ద రక్షణ సిబ్బంది, ఈతలో నైపుణ్యం కలిగిన సిబ్బంది, వైద్య సిబ్బంది నియామకం చేయడంతో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అప్రమత్తత లేకుండా ఇతర ప్రాంతాల్లో స్నానాలు చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశముందని పేర్కొంటూ, భక్తులు క్రమశిక్షణతో వ్యవహరించి అధికారుల మార్గదర్శకాలను అనుసరిస్తూ సురక్షితంగా పుష్కర స్నానాలు ఆచరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

# సమయపాలన, క్రమశిక్షణతో పని చేసి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలి

### - ప్రతి ఉద్యోగికి బొగ్గు ఉత్పత్తితో పరోక్ష సంబంధం ఉంది - సింగరేణి భూపాలపల్లి ఏరియా జిఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 23:సింగరేణి ఉద్యోగులందరూ సమయపాలన పాటిస్తూ, క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. పని గంటలను వృథా చేయకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆయన సూచించారు. శనివారం భూపాలపల్లి ఏరియాలోని ఏరియా వర్క్‌షాప్, ఏరియా హాస్పిటల్, ఏరియా జీఎం కార్యాలయ ఉద్యోగులకు నిర్వహించిన మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సింగరేణి సంస్థ సీఎండీ ఆదేశాల మేరకు ఈ నెల 18 నుంచి సంస్థ వ్యాప్తంగా మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏరియా వర్క్‌షాప్, ఏరియా హాస్పిటల్, జీఎం కార్యాలయ ఉద్యోగులకు బొగ్గు ఉత్పత్తితో ప్రత్యక్ష సంబంధం లేకపోయినా, పరోక్షంగా కీలక బాధ్యత ఉంటుందని పేర్కొన్నారు. గనుల కార్యకలాపాలకు సంబంధించిన దిశానిర్దేశం, నిర్వహణ వివిధ విభాగాల ద్వారా జరుగుతుందని, ప్రతి ఉద్యోగి తన హోదాకు తగిన బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ప్రతి ఉద్యోగి వ్యక్తిగతంగా అభివృద్ధి చెందుతూ సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని, ఇతర ప్రభుత్వ సంస్థల్లో లేని విధంగా సింగరేణిలో ఉద్యోగుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని గుర్తుచేశారు. సమిష్టి కృషితో నాణ్యత, ఉత్పత్తి, ఉత్పాదకత పెంచుతూ సంస్థను మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా సంస్థ రూపొందించే కార్యాచరణ ప్రణాళికలను అర్థం చేసుకుని పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. వినియోగదారులు సంస్థపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం సంస్థ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఉద్యోగుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సమావేశంలో ఎస్ఓటుజీఎం ఎస్.కవీంద్ర, ఏసీఎంవో డాక్టర్ పద్మజ, ఏజీఎం (సివిల్) రవికుమార్, ఏరియా ఇంజనీర్ రాజారావు, డీజీఎం (ఎఫ్అండ్ఏ) పి.రాజేశ్వర్, డీజీఎం (క్వాలిటీ) కృష్ణప్రసాద్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మాటూరి రవీందర్, పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి జి. శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ నాయకుడు హుస్సేన్, వివిధ యూనియన్ నాయకులు, అధికారులు, క్లరికల్ స్టాఫ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

# పేదలకు ఆరోగ్య భరోసా.. ముఖ్యమంత్రి సహాయ నిధి

### - 150 మంది లబ్ధిదారులకు రూ.44 లక్షల చెక్కుల పంపిణీ
### - ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాల అందజేత



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 23:అత్యవసర వైద్య చికిత్సల కోసం ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. శనివారం ఖమ్మం నగరంలోని గట్టయ్య సెంటర్‌లోని తన శిబిర కార్యాలయంలో ఉభయ జిల్లాలైన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన ఏడు నియోజకవర్గాల 150 మంది లబ్ధిదారులకు రూ.44 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య భద్రత కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వేగంగా ఆర్థిక సాయం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా కృషి చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వివిధ ఆటో అడ్డాలకు చెందిన వంద మంది ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలను ఎంపీ పంపిణీ చేశారు. సమాజానికి నిరంతరం సేవలందిస్తున్న ఆటో కార్మికులకు ప్రభుత్వం, తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, ఉమ్మినేని కృష్ణ, రంజిత్ నాయక్, వడ్డెబోయిన నరసింహారావు, గోసు మధు, రాంపుడి రోశయ్య, గుమ్మా రోశయ్య, ఎస్డీ గౌస్, ఇమ్మడి తిరుపతిరావు, స్ఫూర్తి ఓం రాధాకృష్ణ, చల్లా రామకృష్ణారెడ్డి, విప్లవ్ కుమార్, జంగిపల్లి ప్రసాద్, బాణాల లక్ష్మణ్, మల్లెల నాగేశ్వరరావు, కాటేపల్లి కిరణ్, ఉమర్, గౌస్, మాజీద్, చెరుకుమల్లి రవి, దిరిశెల శ్రీనివాసరావు, ఏలూరి శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీల సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే రాగమయి దయానంద్

### - వేంసూరులో కూలీలతో మమేకమైన ఎమ్మెల్యే - మెడికల్ కిట్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సత్తుపల్లి, మే 23:ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శనివారం వేంసూరు మేజర్ గ్రామపంచాయతీలో పర్యటించి ఉపాధి హామీ కూలీల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. గ్రామ చెరువు వద్ద పనిచేస్తున్న సుమారు 200 మంది కూలీలను కలుసుకుని వారి పని పరిస్థితులు, ఆరోగ్య సమస్యలు, బ్యాంకు ఖాతాల్లో కూలి డబ్బులు జమ కావడంలో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. గ్రామ సర్పంచ్ ఫక్రుద్దీన్, ఎమ్మార్వో, ఎంపీడీవోతో కలిసి కూలీలు పనిచేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు మెడికల్ కిట్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడంతో పాటు ఎమ్మెల్యే స్వయంగా టిఫిన్లు వడ్డించారు. త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు, కొత్త పింఛన్లు అర్హులకు అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వేంసూరు గ్రామానికి చెందిన మోరంపూడి భాస్కరరావు సతీమణిని కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, గ్రామ సర్పంచ్ ఫక్రుద్దీన్, ఎమ్మార్వో, ఎంపీడీవో, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి సోమిరెడ్డి, ఉపసర్పంచ్, సీనియర్ నాయకులు దుగ్గిరాల అశోక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, కందుకూరు సొసైటీ చైర్మన్ గొర్ల సంజీవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, గ్రామస్తులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 కూలి ఇవ్వాలి

### - భూమిలేని కూలీలకు వార్షిక జీవన భృతి కల్పించాలి
### - ఏఐకేఎంఎస్ పాలేరు విభాగ ప్రధాన కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఖమ్మం, మే 23:ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.600 కూలి చెల్లించాలని ఏఐకేఎంఎస్ పాలేరు విభాగ ప్రధాన కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం గ్రామంలో ఉపాధి హామీ కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూమిలేని కూలీలకు సంవత్సరానికి రూ.12 వేల జీవన భృతి అందించాలని కోరారు. ఏప్రిల్, మే నెలల్లో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉపాధి కూలీలకు 50 శాతం అదనపు కూలి చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి పనుల ప్రదేశాల్లో తాగునీరు, టెంట్లు, వైద్య సదుపాయాలు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని అన్నారు. కూలీలందరికీ జీవ బీమా సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జీరామ్‌జీ విధానాన్ని రద్దు చేసి మహాత్మా జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన కోరారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేసి నాట్లు, కోతలు, కలుపు తదితర వ్యవసాయ పనులకు కూడా ఉపాధి పనులను విస్తరించాలని సూచించారు. ఫోటో నమోదు విధానాన్ని రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సోమనపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.

# పాత బొగ్గు గనుల కుటుంబ పెన్షనర్లకు నెలకు రూ.1000 కనీస పెన్షన్

### - 2024 పెన్షన్ సవరణలో లోపాలను వెలుగులోకి తెచ్చిన సంఘాల పోరాటం
### - కేంద్ర ప్రభుత్వం సవరణ గెజిట్ విడుదల చేయాల్సి వచ్చినట్లు సంఘాల వ్యాఖ్య



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 23:బొగ్గు గనుల కుటుంబ పెన్షన్ పథకం-1971 పరిధిలోని కుటుంబ పెన్షనర్లకు నెలకు కనీసం రూ.1000 పెన్షన్ అందించేలా భారత ప్రభుత్వం బొగ్గు గనుల పెన్షన్ సవరణ పథకం-2026ను ప్రకటించింది. ఈ సవరించిన పెన్షన్ మొత్తం 2024 మార్చి 8 నుంచి అమల్లోకి వస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. బకాయిలను కూడా చెల్లించనున్నట్లు ప్రకటించగా, దేశవ్యాప్తంగా సుమారు 16 వేల కుటుంబ పెన్షనర్లు లబ్ధి పొందనున్నారు. ఈ నిర్ణయాన్ని ఆల్ ఇండియా అసోసియేషన్ ఆఫ్ కోల్ ఎగ్జిక్యూటివ్స్, ఆల్ ఇండియా కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ సంఘాలు స్వాగతించాయి. 2024 మార్చి 8న విడుదలైన పెన్షన్ సవరణలో అనేక అస్పష్టతలు, వివక్షతలు ఉన్నాయని, ముఖ్యంగా 1971 కుటుంబ పెన్షన్ పథకంలోని పాత పెన్షనర్లకు సమానంగా అమలు జరగలేదని సంఘాలు గత కొన్ని నెలలుగా ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు పలుమార్లు వినతులు సమర్పించాయి. కనీస పెన్షన్ పెంపు ప్రకటించినప్పటికీ అనేక మంది లబ్ధిదారులకు సరైన అమలు జరగకపోవడం, స్పష్టమైన చట్టపరమైన నిబంధనలు లేకపోవడం వల్ల పెన్షనర్లలో అనిశ్చితి నెలకొన్నదని సంఘాలు పేర్కొన్నాయి. తాజా సవరణ ద్వారా ఆ సందిగ్ధతలను ప్రభుత్వం తొలగించాల్సి వచ్చినట్లు స్పష్టమైందని వెల్లడించాయి. ఈ సవరణతో బొగ్గు గనుల కుటుంబ పెన్షన్ పథకం-1971 లబ్ధిదారులకు గత నోటిఫికేషన్‌లో తగిన రక్షణ లేకపోయిన విషయం బయటపడిందని, పరిపాలనా మరియు తనిఖీ సంబంధిత సమస్యలు సమాన అమలుకు అడ్డంకిగా మారినట్లు వెల్లడైందని సంఘాలు పేర్కొన్నాయి. తమ నిరంతర పోరాటం కారణంగానే ప్రభుత్వం కొత్త చట్టబద్ధ ప్రకటన ద్వారా లోపాలను సరిదిద్దాల్సి వచ్చిందని తెలిపాయి. ముఖ్యంగా ఈ సవరణను 2024 మార్చి 8 నుంచే అమల్లోకి వచ్చినట్లుగా అమలు చేయడం ద్వారా అప్పటి ప్రకటనలో లోపాలు ఉన్నాయని ప్రభుత్వం పరోక్షంగా అంగీకరించినట్టేనని సంఘాలు అభిప్రాయపడ్డాయి. ఈ పరిణామాన్ని బొగ్గు గనుల పెన్షనర్ల సంఘటిత విజయంగా అభివర్ణించిన సంఘాలు, భవిష్యత్తులో సమగ్ర పెన్షన్ సంస్కరణలు, వాస్తవిక కనీస పెన్షన్, ధరల పెరుగుదలకు అనుసంధాన భృతి మరియు సామాజిక భద్రత సాధించే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశాయి. పెన్షన్ పెంపుతో పాటు పెన్షనర్ల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సంఘాల కన్వీనర్ పి.కె. సింగ్ రాథోర్ తెలిపారు.

# తీవ్ర ఎండల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## సర్పంచ్ వెంకటేశ్వరరావు సూచన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కాటారం, మే 23:ప్రతాపగిరి గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలంతా తీవ్ర ఎండల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని స్థానిక సర్పంచ్ వూర వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. అత్యవసరం ఉంటే తప్ప ఎండలో బయటకు రావద్దని శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ఉపాధి హామీ కూలీలు, తునికాకు కూలీలు ఉదయం వేళల్లోనే పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎవరూ బయట తిరగకూడదని, రోడ్డు ప్రయాణాలు కూడా తగ్గించుకోవాలని కోరారు. ప్రస్తుతం తీవ్ర ఎండలు, వేడి గాలులు వీచుతున్నందున ప్రజలు పత్తి బట్టలు ధరించడం, టోపీ లేదా తువాలు ఉపయోగించడం, నిమ్మరసం, చల్లని నీరు, చెరుకు రసం వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సర్పంచ్ వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

# ఆరోగ్యం



# ఎండాకాలంలో కూల్ వాటర్ తాగితే చనిపోతారా?

## వైద్యులు ఏం చెప్పారంటే?

మనిషికి నీరు అనేది చాలా ముఖ్యం. అన్నం తినకుండా అయినా మనిషి జీవించగలడేమో కానీ, నీరు తాగకుండా మాత్రం జీవించలేడు. సరైన సమయానికి, సరైన మొత్తంలో నీరు తాగితేనే మనం ఆరోగ్యంగా ఉండగలం. నీరు తాగడంలో ప్రతి వ్యక్తికి ఒక్కో రకమైన విధానం ఉంటుంది. కొంతమంది గోరువెచ్చని నీరు తాగుతారు, మరికొందరు వేడి నీరు తాగడం ఇష్టపడతారు, ఇంకొంతమంది ఐస్ నీరు తీసుకోవడం ఉత్తమంగా భావిస్తారు. అయితే చల్లటి నీరు తాగడం వలన మనిషి చనిపోతాడని పలు కథనాలు వినపడుతున్నాయి. వారు చల్లటి నీరు శరీరానికి హానికరం అని పేర్కొంటున్నారు. ఇంతకీ చల్లటి నీరు తాగడం అనేది నిజంగా హానికరమా? చల్లటి నీరు తాగడం వలన ఎలాంటి సమస్యలు వస్తాయనేది ఇక్కడ తెలుసుకుందాం. చల్లటి నీరు తాగడం వలన ఎలాంటి సమస్యలు వస్తాయి? వైద్యుల ప్రకారం, కొన్ని సందర్భాల్లో చల్లటి నీరు తాగడం వలన కొన్ని సమస్యలు వస్తాయని చెబుతున్నారు. అయితే చల్లటి నీరు తాగడం వల్ల ఒక వ్యక్తి చనిపోవడం అనేది చాలా తక్కువ, అరుదైన సందర్భాల్లో జరుగుతుందని పేర్కొన్నారు. చల్లటి నీరు ఎక్కువగా తాగడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది, ఇది అల్పోష్ణస్థితి మరియు షాక్‌ను కలిగించే అవకాశం ఉంటుంది. అందుకే గుండె జబ్బులతో బాధపడే వ్యక్తులకు చల్లటి నీరు తీసుకోవడం మంచిది కాదని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే, చల్లటి నీరు తాగడం వలన కడుపులో అసౌకర్యం, వాంతులు లేదా జీర్ణశయ సంబంధిత సమస్యలు కూడా ఏర్పడతాయని వారు పేర్కొంటున్నారు.

ఇతర వైద్యులు కూడా గది ఉష్ణోగ్రత వద్ద ఉండే నీరు లేదా, కొద్దిగా చల్లటి నీరే తాగాలని సూచిస్తున్నారు. శారీరక శ్రమ చేసిన తరువాత చల్లటి నీరు తాగడం అనేది అత్యంత ప్రమాదకరమని, దానిని కచ్చితంగా మానేయాలని సూచిస్తున్నారు. చల్లటి నీరు తాగిన తర్వాత, మీకు అసౌకర్యం లేదా ఛాతిలో నొప్పి ఉన్నట్లు అనిపిస్తే, వెంటనే వైద్యుడిని సంప్రదించి సలహా తీసుకోవాలని సూచిస్తున్నారు.

# చికెన్ కందిపప్పు



మీరు ఇప్పటి వరకు ఎన్నో రకాల పప్పులు తిని ఉంటారు. అలాగే ఎన్నో రకాల చికెన్ వంటకాలు కూడా తిని ఉంటారు. చికెన్, పప్పు అంటే ఇష్టం ఉందని తెలుగు వాడు ఉండడంటే నమ్మశక్యం కాదు. కానీ మీరెప్పుడైనా చికెన్ పప్పు తిన్నారా? మన పూర్వికులు గతంలో దీనిని ఎక్కువగా చేసుకుని తినేవారట. దీనిని చేసుకోవడం చాలా సులభం. రుచి మాత్రం మీరు ఊహించినదానికంటే అద్భుతంగా ఉంటుంది. ఈ చికెన్ పప్పును ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి? అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

**చికెన్ పప్పు తయారీకి కావాల్సిన పదార్థాలు**

ఒక కప్పు కందిపప్పు అరకిలో చికెన్ అర టీస్పూన్ ఆవాలు అరటీస్పూన్ జీలకర్ర రెండు ఉల్లిపాయలు ఒక పెద్ద టమాటో 50%ఎశ్రీ% నూనె మూడు పచ్చిమిర్చి కరివేపాకు ఒక టీస్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్ రెండు టీస్పూన్ల కారం రుచికి సరిపడా ఉప్పు అర టీస్పూన్ పసుపు ఒక టీస్పూన్ ధనియాల పొడి అర టీస్పూన్ జీలకర్ర పొడి పావు టీస్పూన్ గరం మసాలా కొత్తిమీర ఒక కప్పు నీరు చికెన్ పప్పు తయారీ విధానం ముందుగా ఒక పాన్ తీసుకొని అందులో 50%ఎశ్రీ% నూనె పోసుకోవాలి. ఆ తరువాత అందులో అర టీస్పూన్ జీలకర్ర, అర టీస్పూన్ ఆవాలు వేసుకోవాలి. అవి చిటపటా అవుతుండగా సన్నగా తురుముకున్న ఉల్లియాపాయ ముక్కలను వేసుకోవాలి. వాటితో పాటు చీల్చి పెట్టుకున్న మూడు పచ్చిమిర్చి, కొన్ని కరివేపాకులు వేసుకొని వాటిని బాగా వేయించుకోవాలి. ఆ తరువాత అందులో ఒక టీస్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసుకొని పచ్చి వాసన పోయేవరకు వేయించుకోవాలి. ఆ తరువాత అందులో అరకిలో చికెన్ వేసుకొని ఆ చికెన్ నీళు వదిలేసేంత వరకు కలుపుకోవాలి. చికెన్ కొంచెం ఉడికిన తరువాత సన్నగా కట్ చేసుకున్న టమాటోలు, రెండు టీస్పూన్ల కారం, రుచికి సరిపడా ఉప్పు, ఒక టీస్పూన్ ధనియాల పొడి, అర టీస్పూన్ జీలకర్ర పొడి, పావు టీస్పూన్ గరం మసాలా వేసుకోవాలి. ఆ తరువాత ఆ మసాలా మొత్తం చికెన్‌కు పట్టుకునే విధంగా బాగా కలుపుకోవాలి. ఇలా కలుపుకున్న తరువాత చికెన్‌లోని నూనె పైకి తెర్లిన తరువాత అందులో ముందుగా ఉడకపెట్టుకున్న కందిపప్పు వేసుకోవాలి. అలాగే ఒక కప్పు నీరు కూడా వేసుకోవాలి. మొత్తం ఓసారి కలుపుకోవాలి. అనంతరం వాటిని ఒక పది నిమిషాల పాటు ఉడికించుకొని అందులో కొత్తిమీర చల్లుకుని దించుకుంటే ఎంతో రుచికరమైన టేస్టీ, టేస్టీ చికెన్ పప్పు సిద్ధమైనట్లే. దీని రుచి మాత్రం అద్భుతంగా ఉంటుంది. ఒక్కసారి తింటే జీవితంలో మళ్ళీ పప్పు జోలికి వెళ్ళరు.

# వాలంటైన్స్ డే స్పెషల్ రెసిపి.. రెడ్ వెల్వెట్ కప్ కేకు



ప్రపంచంలోని చాలా దేశాల్లో ఫిబ్రవరి 14ని వాలంటైన్స్ డేగా జరుపుకుంటారు. వాలంటైన్స్‌డే రోజున మీ ప్రియమైన వారికి ప్రత్యేకంగా ఏదైనా తినిపించాలనుకుంటే రెడ్ వెల్వెట్ కేక్ బెస్ట్ ఆప్షన్. రెడ్ వెల్వెట్ కప్‌కేక్ అనేది ఒక ప్రసిద్ధ డెజర్ట్,ఇది దాని ప్రత్యేకమైన ఎరుపు రంగు, రుచికి ప్రసిద్ధి చెందింది. తరచుగా వేడుకలు,ప్రత్యేక సందర్భాలలో తయారు చేయబడతాయి.రెడ్ వెల్వెట్ కప్‌కేక్‌లు రుచికరమైనవి మాత్రమే కాకుండా వాటిలో కొన్ని పోషక విలువలు కూడా ఉన్నాయి. వాలంటైన్స్ డే స్పెషల్‌గా ఎగ్‌లెస్ రెడ్ వెల్వెట్ కప్ కేకుని ఇంట్లోనే ఈజీగా ఎలా తయారు చేసుకోవచ్చో ఇక్కడ చూడండి.

ఎగ్ లెస్ రెడ్ వెల్వెట్ కప్ కేకు తయరీకి కావాల్సిన పదార్థాలు -పచ్చిపాలు- 120 -వెనిగర్- 1.5 టేబుల్ స్పూన్ -మైదా పిండి-160 గ్రాములు -కోకో పౌడర్-1 టేబుల్ స్పూన్ -బేకింగ్ సోడా-1/2 టేబుల్ స్పూన్ -బేకింగ్ పౌడర్-1/2 టేబుల్ స్పూన్ -రిఫైన్డ్ ఆయిల్-120 ఎంఎల్-పెరుగు-60 గ్రాములు -చక్కెర-150 గ్రాములు -రెడ్ జెల్ ఫుడ్ కలర్-1 టేబుల్ స్పూన్ -వెన్నిలా ఎక్స్ ట్రాక్ట్-1.5 టేబుల్ స్పూన్ -అన్ సాల్టెడ్ బటర్-115 గ్రాములు -పంచదార పౌడర్-240 గ్రాములు -క్రీమ్ చీజ్-225 గ్రాములు -వెన్నిలా ఎసెన్స్-కొంచెం -ఉప్పు-రుచికి తగినంత ఎగ్ లెస్ రెడ్ వెల్వెట్ కప్ కేకు తయరీ విధానం -ముందుగా పచ్చిపాలలో వెనిగర్ వేసి కలిపి 10 నిమిషాలు పక్కనపెట్టుకోండి. -తర్వాత ఒక బౌల్ మీద జాలి పెట్టి అందులో మైదా పిండి, కోకో పౌడర్, బేకింగ్ సోడా, బేకింగ్ పౌడర్, రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా జల్లించి పక్కనపెట్టుకోవాలి. -తర్వాత మరో బౌల్ లో చిక్కనిపెరుగు, వెనిగర్ కలిపి ఉంచిన పాల మిశ్రమాన్ని, రిఫైన్డ్ ఆయిల్, చక్కెర, రెడ్ జెల్ ఫుడ్ కలర్, వెన్నిలా ఎక్స్ ట్రాక్ట్ వేసి కలపండి. చక్కెర పూర్తిగా కరిగేదాకా బీట్ చేయాలి. -ఇప్పుడు ముందుగా జల్లించి పక్కనపెట్టుకున్న పిండిని మూడు భాగాలుగా విభజించి అందులో ఒక భాగాన్ని ఇందులో వేసి బాగా కలపండి. -ఇప్పుడు కప్‌కేక్ లైనర్ ట్రే తీసుకొని 12 కప్ మఫిన్ టిన్ ను లైన్ చేయండి. -ఇప్పుడు కప్ కేకు లైనర్స్ లో రెడీ చేసిన పిండిని పూర్తిగా కాకుండా సగం సగం వరకు నింపండి. -తర్వాత ఓ టూత్ పిక్ తీసుకొని ఆ పిండిని కొంచెం కలబెట్టి తిప్పండి చాలు. -ఇప్పుడు ఓవెన్ లో ఈ ట్రేని ఉంచి 170 డిగ్రీల దగ్గర 20 నిమిషాల వరకు బేక్ చేసి తర్వాత బయటకు తీసి ఓ టూత్ పిక్ తో చెక్ చేయండి. పర్ఫెక్ట్ గా వస్తే ఈ ట్రేని బయటకు తీసి చల్లారనివ్వండి. -తర్వాత అన్ సాల్టెడ్ బటర్ లో పంచదార పొడి వేసి బాగా బీట్ చేసిన తర్వాత ఇందులోనే క్రీమ్ చీజ్ వేసి బీట్ చేయండి. ఇందులోనే కొంచెం వెన్నిలా ఎసెన్స్ కూడా వేసి బాగా బీట్ చేసి అరగంట పాటు దీన్ని ఫ్రిడ్జ్ లో పెట్టుకోండి.-తర్వాత చల్లారిన కప్ కేకుని ట్రే నుంచి బయటకు తీసి కేకు మీద ఫిడ్జ్ లో ఉంచి మిశ్రమంతో మీకు నచ్చిన విధంగా డెకరేట్ చేసుకోండి. అంతే ఎగ్ లెస్ రెడ్ వెల్వెట్ కప్ కేకు రెడీ.

# చికెన్ రోస్ట్




మీకు నాన్ వెజ్ ఇష్టమైతే, చికెన్‌తో కొత్త వంటకాలను ప్రయత్నించడం ఇష్టం ఉంటే, ఈ అస్సామీ స్టైల్ రోస్టెడ్ చికెన్ రెసిపీ మీరు తప్పకుండా ట్రై చేయాలి. సాధారణ చికెన్ ఫ్రైతో పోలిస్తే ఇది ఎంతో రుచికరంగా ఉంటుంది. అలాగే చేసుకోవడం కూడా అత్యంత సులభం. కేవలం సాధారణమైన పద్ధతిలో చేసుకునే ఈ వంట ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి? అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

రోస్టెడ్ చికెన్ రెసిపీకి కావాల్సిన పదార్థాలు చికెన్ – 500 గ్రాములు ఉప్పు – రుచికి సరిపడా పసుపు – 1స్పూను, కారం – 1 స్పూను, జీలకర్ర పొడి – 1 స్పూను, మిరియాల పొడి – 1 స్పూను, నిమ్మరసం – 3 స్పూను, నల్ల నువ్వులు –్వా కప్పు నూనె – 4 స్పూను, వెల్లుల్లి పేస్ట్ – 1 స్పూను, అల్లం పేస్ట్ – 2 స్పూను, ఉల్లిపాయ ముక్కలు – అరకప్పు

రోస్టెడ్ చికెన్ తయారీ విధానం ముందుగా చికెన్ ముక్కలను శుభ్రంగా కడిగి ఒక గిన్నెలో ఉంచాలి. అందులో ఉప్పు, పసుపు, కారం, జీలకర్ర పొడి, మిరియాల పొడి, నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని 20 నిమిషాలు మెరినేట్ చేయాలి. ఆ తరువాత, ఒక పాన్ వేడి చేసి అందులో నల్ల నువ్వులను వేసి 1 నిమిషం వేయించాలి. వేయించిన నువ్వులు చల్లార్చి, మిక్సీ జార్‌లో వేసి నూనె, వెల్లుల్లి, అల్లం, పచ్చిమిర్చి, ఉల్లిపాయలు వేసి గ్రైండ్ చేసి పేస్ట్ గా చేసుకోవాలి. ఇప్పుడు ఈ పేస్టును పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు మెరినేట్ చేసిన చికెన్ నుంచి అదనపు నీటిని తీసి, ఇంతకు ముందు చేసుకున్న పేస్ట్‌ను చికెన్‌లో బాగా కలపాలి. తర్వాత, మరో 30 నిమిషాలు మెరినేట్ చేయాలి. ఈ మధ్యలో, మీ మైక్రోవేవ్ ఓవెన్‌ను 180 డిగ్రీలకు ప్రీహీట్ చేయండి. ప్రీహీట్ చేసిన ఓవెన్‌లో ట్రేలో చికెన్ ముక్కలను పెట్టి 30 నిమిషాలు ఉడికించాలి. 30 నిమిషాలు ఉడికాక.. చికెన్‌ను ఓవెన్ నుంచి తీసి వెంటనే నెయ్యి లేదా వెన్నతో పూయండి. అంతే రుచికరమైన అస్సామీ రోస్టెడ్ చికెన్ రెడీ.

# చుక్క ఆయిల్ అక్కర్లేదు..ఈ మంగళూరు రెసిపి జీవితంలో ఒక్కసారైనా తిని తీరాల్సిందే



కరోనా తర్వాత నుంచి అందరిలోనూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ విపరీతంగా పెరిగిపోయింది. ఈ క్రమంలో ఆయిల్ ఫుడ్ ని తగ్గించి ఆరోగ్యంగా ఉండే ఫుడ్ వైపు చాలామంది మెగ్గుచూపుతున్నారు. సాక్షాత్తూ మన ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా ఆయిల్ వాడకం తగ్గించాలని పిలుపునిచ్చారు. అయితే చుక్క ఆయిల్ లేకుండా చేసే రెసిపిలు చాలానే ఉన్నాయి. అలాంటి వాటిల్లో నీరు దోశ ఒకటి. మంగళూరులో నీరు దోసె చాలా ఫేమస్. కర్ణాటకలో ఏ మూలకు వెళ్లిన అక్కడి రెస్టారెంట్లలో మంగళూరు స్పెషల్ నీర్ దోశ దొరుకుతుంది. దీనిని మీ ఇంట్లో కూడా ఫర్ఫెక్ట్ గా చేసుకోవాలంటే కొన్ని టిప్స్ పాటించాలి. మంగళూరు స్పెషల్ నీరు దోశ తయారీకి కావాల్సిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి.

నీరు దోశ తయారీకి కావాల్సిన పదార్థాలు -ఇడ్లీ బియ్యం లేదా రేషన్ బియ్యం -పచ్చి కొబ్బరి -ఉప్పు నీరు దోశ తయారీ విధానం -ముందుగా 1 కప్పు ఇడ్లీ బియ్యం లేదా రేషన్ బియ్యాన్ని శుభ్రంగా కడిగి నీళ్లలో వేసి కనీసం 6 గంటలు నానబెట్టండి. -తర్వాత నానిన బియ్యాన్ని కూడా రెండు సార్లు కడిగి తర్వాత దానిని మిక్సీ గిన్నెలో వేసి అందులోనే కొన్ని నీళ్లు, కొన్ని పచ్చి కొబ్బరిముక్కలు వేసి మెత్తటి పేస్ట్ లా చేసుకోవాలి.

– తర్వాత అందులో రుచికి సరిపడా ఉప్పు వేసి అవసరమనుకుంటే ఇంకొంచెం నీళ్లు కూడా పోసి బాగా పలుచగా పిండి కలుపుకోవాలి. -ఇప్పుడు స్టవ్ మీద ధోశ పెనం పెట్టి ఉల్లిపాయతో రుద్ది రవ్వ దోశ ఎలా వేసుకుంటామో ఆ విధంగా వేసుకోండి. అంతే నారుోశ రెడీ. -ఈ నీరు దోశని చికెన్ లేదా మటన్ కుర్మాతో గానీ లేదా మీకు నచ్చిన చట్నీతో తింటే టేస్ట్ యమా రుచిగా ఉంటుంది.

# సినిమా న్యూస్



## ఓటీటీలోకి ధనుష్ కర.. స్ట్రీమింగ్ ఎప్పుడు? ఎక్కడంటే?

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ వైవిధ్యమైన సినిమాలతో ప్రేక్షకులను పలకరిస్తుంటారు. ధనుష్ క్రేజీ బ్యూటీ మమితా బైజు జంటగా నటించిన తాజా చిత్రం 'కర'. ఏప్రిల్ 30న థియేటర్లలో విడుదలైన ఈ సైకలాజికల్ యాక్షన్ డ్రామా మూవీ ఇప్పుడు ఓటీటీ ప్రియులను అలరించేందుకు సిద్ధమైంది. ఈ సినిమా డిజిటల్ రిలీజ్ డేట్‌ను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా ప్రకటించింది. థియేటర్లలో మిస్ అయిన వారు ఇంట్లోనే కూర్చుని ఈ యాక్షన్ థ్రిల్లర్‌ను ఎప్పుడు చూడొచ్చో ఇప్పుడు తెలుసుకుందాం.

గత కొన్ని రోజులుగా 'కర' సినిమా ఓటీటీ రిలీజ్ గురించి సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వినిపించాయి. వాటన్నింటికీ తెరదించుతూ నెట్‌ఫ్లిక్స్ క్లారిటీ ఇచ్చేసింది. ఈ నెల 28వ తేదీ (మే 28) నుంచి ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.

ఇక కేవలం తమిళంలోనే కాకుండా తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో కూడా ఈ చిత్రం అందుబాటులోకి రాబోతోంది. కాబట్టి అన్ని భాషల ప్రేక్షకులకు ఇది గుడ్ న్యూస్ అని చెప్పాలి. ఈ సినిమా కథ 1990ల కాలంలో సాగుతుంది. ఇందులో 'కర స్వామి' (ధనుష్) ఒక పల్లెటూరి దొంగ. తండ్రి కోదండం (కేఎస్ రవికుమార్)తో గొడవపడి ఇల్లు వదిలి వచ్చేస్తాడు. ఇక సొంతంగా ఒక హోటల్ పెట్టుకోవాలనేది కర ఆశ. కానీ బ్యాంకులు అతడికి లోన్ ఇవ్వవు. అదే సమయంలో ఊరిలో ఉన్న తన తండ్రి మరణిస్తాడు.

తన తండ్రి చావుకు, ఊరిలోని రైతుల కష్టాలకు బ్యాంక్ వ్యవహార శైలే కారణమని కర తెలుసుకుంటాడు. బ్యాంకుపై పగ పెంచుకున్న కర.. అదే బ్యాంకు శాఖల్లో వరుసగా దొంగతనాలకు పాల్పడుతుంటాడు. మరి కర చేసిన ఈ బ్యాంకు దొంగతనాలను డీఎస్పీ భరతన్ (సూరజ్ వెంజరమూడు) ఎలా అడ్డుకున్నాడు? ఈ కథలోకి బ్యాంకు మేనేజర్ ముత్తు సెల్వన్ (జయరామ్) ఎలా వచ్చాడు? అసలు కర బ్యాంకుల ఆట ఎలా కట్టించాడు? అనే విషయాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

బాక్సాఫీస్ టాక్ ఎలా ఉందంటే?: 'పోర్ తొళిల్' వంటి సూపర్ హిట్ థ్రిల్లర్‌ను అందించిన దర్శకుడు విఘ్నేష్ రాజా ఈ సినిమాను తెరకెక్కించారు. భారీ అంచనాల మధ్య థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రానికి మిక్స్‌డ్ టాక్ వచ్చింది. అందువల్ల బాక్సాఫీస్ దగ్గర ఆశించిన స్థాయిలో కలెక్షన్లు రాబట్టలేకపోయింది. కానీ థ్రిల్లర్ సినిమాలకు ఓటీటీలో మంచి రెస్పాన్స్ వస్తుంది కాబట్టి, నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సినిమాకు మంచి ఆదరణ దక్కే అవకాశం ఉంది. థియేటర్లలో ఆశించిన స్థాయిలో ఆడకపోయినా, ధనుష్ నటన మరియు విఘ్నేష్ రాజా టేకింగ్ కోసం ఈ సినిమాను ఒకసారి తప్పకుండా చూడొచ్చు. ఇక ముఖ్యంగా యాక్షన్, సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలను ఇష్టపడే వారికి 'కర' మంచి ఛాయిస్ అవుతుంది. మరి లేట్ చేయకుండా ఈ మే 28న నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సినిమాను చుసేందుకు రెడీ అవ్వండి.






## ఒక్క లుక్‌తోనే అలజడి.. తెల్లచీరలో వైష్ణవి గ్లామర్ వైరల్

'బేబీ' సినిమాతో ఓవర్ నైట్ స్టార్ గా మారిన మన తెలుగమ్మాయి వైష్ణవి చైతన్య, ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. మల్లెపూవు లాంటి తెల్లటి చీరలో వైష్ణవి దేవకన్యలా కనిపిస్తోంది. కేవలం హార్ట్ ఎమోజీలతో ఆమె పెట్టిన క్యాప్షన్ ఇప్పుడు తెగ వైరల్ అవుతోంది. ఈ ట్రెడిషనల్ లుక్‌లో వైష్ణవి అందం చూసి ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు. వైష్ణవి కట్టుకున్న ఈ అందమైన వైట్ కలర్ కాస్ట్యూమ్‌ను 'అనూష రెడ్డి కోట్యూర్' ప్రత్యేకంగా డిజైన్ చేశారు. దానికి తగ్గట్టుగా 'ది జ్యువెలరీ గ్యాలరీ' అందించిన చోకర్ నెక్లెస్, గాజులు ఆమెకు మరింత రాయల్ లుక్‌ను తీసకువచ్చాయి. ఇక సెలబ్రిటీ స్టైలిస్టు సంధ్య, షెఫాలి, పల్లవి కలిసి వైష్ణవిని ఎంతో పద్ధతిగా, అందంగా ముస్తాబు చేశారు. ఫోటోగ్రాఫర్ సుజనా తన కెమెరాతో ఈ అందాన్ని అద్భుతంగా బంధించారు.

యూట్యూబ్‌లో 'సాఫ్ట్‌వేర్ డెవలపర్' వంటి షార్ట్ ఫిలిమ్స్‌తో కెరీర్ స్టార్ట్ చేసిన వైష్ణవి, ఆ తర్వాత 'అల వైకుంఠపురములో' వంటి పెద్ద సినిమాల్లో చిన్న క్యారెక్టర్స్ చేసింది. కానీ, 'బేబీ' సినిమా ఆమె తలరాతను మార్చేసింది. ఇక గతేడాది సిద్ధు జొన్నలగడ్డతో కలిసి 'జాక్' సినిమాలో నటించి అలరించిన ఈ ముద్దుగుమ్మ, ఇప్పుడు టాలీవుడ్‌లో బిజీ హీరోయిన్లలో ఒకరిగా మారిపోయింది. ప్రస్తుతం ఆనంద్ దేవరకొండతో కలిసి వైష్ణవి నటిస్తున్న రొమాంటిక్ డ్రామా 'ఎపిక్'. ఆదిత్య హాసన్ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా సమ్మర్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఇక ఇటీవల విడుదలైన టీజర్ ప్రేక్షకుల్లో మంచి అంచనాలను పెంచింది. ఇక ఈ సినిమాలో వైష్ణవి 'కడలి' అనే ఒక బోల్డ్ అండ్ ఇండిపెండెంట్ అమ్మాయి పాత్రలో నటిస్తోంది. 'కడలి' క్యారెక్టర్ గురించి వైష్ణవి మాట్లాడుతూ.. కథ వినగానే తనకు బాగా నచ్చేసిందని చెప్పింది. ఇక తన ఎమోషన్స్ ఏంటో, తన నిర్ణయాలు ఏంటో స్పష్టత ఉన్న ఒక ప్రాక్టికల్ అమ్మాయి పాత్ర ఇదని, ఈ తరం అమ్మాయిలందరికీ ఈ క్యారెక్టర్ బాగా కనెక్ట్ అవుతుందని నమ్మకం వ్యక్తం చేసింది. ఇక షూటింగ్ అంతా ఒక ఫ్రెండ్లీ వాతావరణంలో జరిగిందని ఆమె చెప్పుకొచ్చింది. గ్లామర్ రోల్స్ మాత్రమే కాదు, నటనకు ప్రాధాన్యమున్న పాత్రలు చేస్తూ వైష్ణవి చైతన్య దూసుకుపోతోంది. ఇక అటు వైట్ శారీ ఫోటోలతో కుర్రకారు మనసులు దోచుకుంటూనే, ఇటు 'ఎపిక్' సినిమాతో థియేటర్లలో అలరించడానికి సిద్ధమవుతోంది. మన తెలుగు అమ్మాయి ఇలాంటి మరిన్ని విజయాలు అందుకోవాలని ఆశిద్దాం.

## పొగుడుతూనే.. ఇచ్చిపడేసిన చిన్నారి పెళ్లి కూతురు!

చిన్నారి పెళ్లికూతురు సీరియల్ తో మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగ్ బ్యూటీ అవికా గోర్ ఇప్పుడు మరోసారి వార్తల్లో నిలిచారు. అయితే ఈసారి సినిమా కంటే.. తనపై వచ్చిన ఓ షాకింగ్ రూమర్ గురించి చేసిన కామెంట్స్ తో సోషల్ మీడియాలో ట్రెండింగ్ లోకి వచ్చారు. తనపై వచ్చిన గాసిప్ ను తిట్టకుండా.. దాన్ని రాసిన వాళ్ల క్రియేటివిటీని మెచ్చుకోవడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

అవికా నటించిన అగ్లీ స్టోరీ మూవీ రీసెంట్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. నందు హీరోగా నటించిన ఆ చిత్రానికి ప్రణవ్ స్వరూప్ దర్శకత్వం వహించాడు. ఆ మూవీ ప్రమోషన్స్ లో భాగంగా అవికా తన పర్సనల్ లైఫ్ కు సంబంధించిన కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలు పంచుకున్నారు. ముఖ్యంగా తాను 18 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు తనపై వచ్చిన ఒక రూమర్ గురించి చెప్పిన తీరు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.

18 ఇయర్స్ వయసులో తనకు 32 ఏళ్ల యాక్టర్ తో ఏకంగా అఫైర్ ఉందని రాశారని గుర్తు చేసుకున్నారు. 'అంతేకాదు.. మేమిద్దరం సీక్రెట్ గా పెళ్లి చేసుకుని బిడ్డను కూడా కన్నామని చెప్పారు. ఆ బిడ్డను అందరికీ దాచిపెట్టారని కథ కూడా యాడ్ చేశారు ' అంటూ నవ్వుతూ తెలిపారు. ఆ రూమర్ చదివినప్పుడు తాను షాక్ అయ్యానని.. కానీ అదే సమయంలో క్రియేటివ్ గా మాత్రం అనిపించిందని తెలిపారు. ఇంకా ఆమె మాట్లాడుతూ.. "ఆ నటుడితో నేను ఎప్పుడు లవ్ లో పడ్డానో నాకే తెలియదు. మేమిద్దరం కలిసి పని చేశాం అంతే. కానీ వాళ్లు మాత్రం పూర్తి లవ్ స్టోరీ తయారు చేశారు. పైగా బిడ్డను కూడా యాడ్ చేశారు. అసలు ఏ లెవెల్‌లో ఆలోచించారో అర్థం కాలేదు. అలా రాసేవాళ్లు సినిమాలకు కథలు రాస్తే బాగుంటుంది" అంటూ సరదాగా వ్యాఖ్యానించింది. సాధారణంగా హీరోయిన్లు రూమర్స్ పై అసహనం వ్యక్తం చేస్తుంటారు. కానీ అవికా మాత్రం పొగుడుతూనే ఇచ్చి పడేసినట్లు అర్థమవుతోంది.



ఇక వ్యక్తిగత జీవితంపై కూడా అవికా కొన్ని విషయాలు వెల్లడించింది. ప్రస్తుతం ఆమె థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్ లో ఉంటోందని తెలిపారు. తన భర్త అక్కడ ప్రముఖ ట్రావెల్ కంపెనీలో ఉన్నత పదవిలో పనిచేస్తున్నారని చెప్పిన అవికా.. కెరీర్ దృష్ట్యా బ్యాంకాక్ లో ఉండటం మంచిదని భావించి.. ఇండియా వదిలి అక్కడికి షిఫ్ట్ అయినట్లు వివరించారు. ఇప్పటికే బ్యాంకాక్‌లో ఓ ఇల్లు కూడా కొనుగోలు చేశామని, ప్రస్తుతం ఇంటీరియర్ పనులు జరుగుతున్నాయని.. అందుకే తాత్కాలికంగా ఓ అపార్ట్మెంట్ లో ఉంటున్నామని చెప్పారు.

త్వరలోనే కొత్త ఇంట్లోకి మారిన తర్వాత హౌస్ టూర్ వీడియోను యూట్యూబ్ లో షేర్ చేస్తానని వెల్లడించారు. అయితే థాయ్ లాండ్ కు షిఫ్ట్ అయినా.. సినిమాలకు మాత్రం దూరం కాదని స్పష్టం చేశారు అవికా. షూటింగ్స్ కోసం తరచూ ఇండియాకు వస్తుంటానని, కొన్ని రోజుల పాటు వర్క్ చేసి.. వీకెండ్ లో మళ్లీ బ్యాంకాక్ వెళ్తానని తెలిపింది. మొత్తానికి ఒకప్పుడు చైల్డ్ ఆర్టిస్ట్ గా గుర్తింపు తెచ్చుకున్న అవికా.. ఇప్పుడు తన కెరీర్, పర్సనల్ లైఫ్ ను బ్యాలెన్స్ చేస్తూ ముందుకు సాగుతున్నారు.

# అగ్నిప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే

## ప్రభుత్వ సహాయం అందించేందుకు కృషి చేస్తామని హామీ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రేగొండ, మే 23 : జయశంకర్-భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రేపాకపల్లి గ్రామంలో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో చాగర్ల చంద్రమొగిలి మృతి చెందడం బాధాకరమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. శనివారం ఘటన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు వరి పొలాల్లో గడ్డిని కాల్చకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటువంటి అగ్నిప్రమాదాలు ప్రాణనష్టం కలిగించే ప్రమాదం ఉన్నందున వ్యవసాయ శాఖ అధికారులు గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందేలా తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నర్సింగాపూర్ గ్రామంలో అనిశెట్టి నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. ఇక మొగుళ్లపల్లి మండలం ఎల్లారెడ్డిపల్లిలో వనపర్తి మొండయ్య, కదుర్ల కొమురయ్య, మేకల రాజ్‌కుమార్, నైనాకంటి కృష్ణారెడ్డి లకు చెందిన సుమారు 100 క్వింటాళ్ల మొక్కజొన్న ధాన్యం అగ్నిప్రమాదంలో కాలిపోయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఎల్లారెడ్డిపల్లికి చేరుకుని అగ్నిప్రమాద ప్రాంతాన్ని పరిశీలించి బాధిత రైతులను పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలంలో చిన్న అజాగ్రత్త కూడా భారీ అగ్నిప్రమాదాలకు దారితీస్తుందని, రైతులు పంట అవశేషాలు, వరి కొయ్యలకు నిర్లక్ష్యంగా నిప్పంటించరాదని ఎమ్మెల్యే సూచించారు. రైతులు అప్రమత్తంగా ఉండి తమ పంటలను కాపాడుకోవాలని తెలిపారు. ప్రభుత్వం తరఫున బాధిత రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంట భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గుతోజ్ కిష్టయ్య, రేగొండ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య, ఎమ్మార్వో, సంబంధిత శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం

## - నిష్పక్షపాతంగా లబ్ధిదారుల ఎంపిక జరగాలి - ఎమ్మెల్యే కోరం కనకయ్య



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, మే 23 : జూన్ రెండో తేదీ నుంచి రెండో విడతలో అర్హులైన ప్రతి పేదవారికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా నిష్పక్షపాతంగా జరగాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శనివారం టేకులపల్లి మండల పరిధిలోని పలు గ్రామపంచాయతీల్లో పర్యటించిన ఆయన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. తడకలపూడి గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో రూ.83 లక్షలతో నిర్మించనున్న కల్వర్టుకు, రూ.50 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారికి శంకుస్థాపన చేశారు. అనంతరం బొమ్మనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. పంచాయతీ కేంద్రంలో రహదారి సమస్యను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లచ్చగూడెంలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, లచ్చగూడెం మరియు కిష్టారం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. అలాగే నిర్మాణంలో ఉన్న కిష్టారం వంతెన పనులను తనిఖీ చేసి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ముత్యాలంపాడు ఎక్స్‌రోడ్ నుంచి పేగళ్లపాడు వెళ్లే రహదారిలోని కల్వర్టు, మద్రాస్ తండా గ్రామపంచాయతీలోని కల్వర్టు, పెట్రామ్ చలక గ్రామపంచాయతీలో నిర్మాణ దశలో ఉన్న వంతెన పనులను కూడా పరిశీలించి సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఎవరూ ప్రలోభాలకు లోను కావద్దని, పూర్తిగా అర్హత ఆధారంగానే ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు కోరం సురేందర్, మండల కమిటీ అధ్యక్షుడు లక్కినేని శ్యామ్, ఆత్మ కమిటీ అధ్యక్షుడు మంగీలాల్, దేవనాయక్, కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామపంచాయతీల సర్పంచులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అక్రమ మోటార్ల దందాతో అన్నదాతలకు నష్టం

## - 7.5 హెచ్‌పీ మోటార్ వినియోగంతో కాలిపోతున్న రైతుల మోటార్లు


## - అధికారుల నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 23 : వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ సదుపాయాన్ని కొందరు అక్రమంగా దుర్వినియోగం చేస్తూ తోటి రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్న ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గ పరిధిలో వెలుగుచూసింది. నిబంధనలకు విరుద్ధంగా భారీ సామర్థ్యం గల మోటార్లను వినియోగించడం వల్ల సాధారణ రైతుల మోటార్లు తరచూ కాలిపోతున్నాయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఓ వ్యక్తి అనుమతికి మించి 7.5 హెచ్‌పీ సామర్థ్యం గల భారీ మోటారును వినియోగిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఈ మోటార్ కారణంగా విద్యుత్ లైన్లపై అధిక భారం పడుతూ ఓల్టేజ్ సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఫలితంగా చుట్టుపక్కల రైతుల మోటార్లు ప్రతి నాలుగు నెలలకు ఒకసారి కాలిపోతున్నాయని వాపోయారు. మోటార్లు మరమ్మతు చేయించుకోవడానికి, వైండింగ్ చేయించడానికి ఒక్కోసారి రూ.5 వేల వరకు ఖర్చవుతోందని, ఏడాదికి పలుమార్లు ఇదే పరిస్థితి ఎదురవుతుండటంతో అప్పులపాలవుతున్నామని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. గత కొన్ని నెలలుగా ఈ అక్రమ వ్యవహారం కొనసాగుతున్నప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. శాఖ అనుమతి లేకుండా ఇంత భారీ మోటార్ ఎలా వినియోగిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. అధికారుల అండదండలతోనే ఈ వ్యవహారం సాగుతోందా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రైతుల ఫిర్యాదుల నేపథ్యంలో శనివారం విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. సంబంధిత పొలంలో పరిశీలన చేపట్టగా, అక్కడ ఉన్న మోటార్‌పై కంపెనీ వివరాలు, సామర్థ్యాన్ని సూచించే లేబుల్ తొలగించి ఉండటం గమనించినట్లు సమాచారం. మోటార్ సామర్థ్యాన్ని దాచిపెట్టేందుకే ఇలా చేసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. లేబుల్ లేకపోయినా మోటార్ పరిమాణం, వినియోగిస్తున్న విద్యుత్ లోడ్‌ను బట్టి అది భారీ సామర్థ్యం గల మోటారేనని స్థానిక రైతులు చెబుతున్నారు. అక్రమ కనెక్షన్‌ను వెంటనే తొలగించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అలాగే నిర్లక్ష్యంగా వ్యవహరించిన స్థానిక సిబ్బంది, అధికారులపై కూడా విచారణ జరపాలని కోరుతున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే విద్యుత్ ఉపకేంద్రం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని రైతులు హెచ్చరిస్తున్నారు.

# కోరుట్ల నియోజకవర్గంలో పలువురిని పరామర్శించిన జువ్వాడి కృష్ణారావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 23 : కోరుట్ల నియోజకవర్గంలోని కోరుట్ల, మల్లాపూర్, మెట్పల్లి మండల గ్రామాలకు చెందిన పలువురు శనివారం మృతి చెందగా, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ఆయా గ్రామాల్లో మృతదేహాలకు పూలమాలతో శ్రద్ధాంజలి ఘటించి, అంతిమయాత్రలో పాల్గొన్నారు. కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం అధ్యక్షుడు రజి, కోరుట్ల పట్టణంలో నివాసం ఉంటున్న రాయికల్ మున్సిపల్ కమిషనర్ మనోహర్ తల్లి, సీనియర్ పాత్రికేయులు గంగుల రామ్ గోపాల్, సీనియర్ న్యాయవాది సత్యార్థ ప్రకాష్ సోదరుల తల్లి రాంబాయి, పట్టణంలోని 13,వ వార్డుకు చెందిన ముక్కెర మీనయ్యలు మృతి చెందగా, వారి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఇటీవల పసుల విక్రమ్ మృతి చెందగా, ఆయన తండ్రి రాంప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించారు. మెట్ పెల్లి మండలం వేంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కొమ్ముల రాజేశ్వర్ రెడ్డి నానమ్మ శ్రీరాముల నారాయణ తల్లి మరణించగా, అక్కడ మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించి, అంతిమయాత్రలో పాల్గొన్నారు. అనంతరం మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన పాత్రికేయుడు నిమిష కవి రాజేష్ తండ్రి సారంగం ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం అదే గ్రామంలో ఇటీవలే మృతి చెందిన గొట్టిపడతా కర్రే మల్లయ్య కుటుంబాన్ని పరామర్శించారు. కృష్ణారావు వెంట కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, బలిజ రాజారెడ్డి, మురళి, సంఘ లింగం, రిజ్వాన్, వేంపేట సర్పంచ్ గోరుముంతల ప్రవీణ్, ఉపసర్పంచ్ అల్లూరి సురేందర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకట్రెడ్డి, మహేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షులు జలపతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మాట్ల సోమయ్య, మాజీ ఎంపిటిసి మరిపెల్లి మల్లయ్య, రాజశీ, సిరిపురం రవి, నందు తదితరులు ఉన్నారు

# మార్కెట్ వాల్యూ అప్డేషన్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

## భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 23 : మార్కెట్ వాల్యూ అప్డేషన్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్ కుమార్, రెవెన్యూ శాఖ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మార్కెట్ వాల్యూ అప్డేషన్‌పై సమీక్ష నిర్వహించారు. భద్రాద్రి జిల్లా ఐడీఓసీ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెవిన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలు సమన్వయంతో పనిచేసి భూభారతి, ఐజీఆర్ఎస్ పోర్టల్‌లో ఫామ్ 1, 2, 3, 4 అప్డేషన్లను వేగవంతం చేయాలని సూచించారు. జీవో నెం.44 ప్రకారం జిల్లా నుంచి మండల స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేసి మార్కెట్ వాల్యూ సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. భూ లావాదేవీలు, రిజిస్ట్రేషన్ వ్యవస్థలో పారదర్శకత పెంపుతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని 379 రెవెన్యూ గ్రామాల్లో మార్కెట్ వాల్యూ అప్డేషన్‌ను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. డిఆర్ఓ పద్మావతి, కొత్తగూడెం ఆర్డీవో మధు, ఈ-డిస్ట్రిక్ మేనేజర్ సైదేశ్వరరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన.. బడే నాగజ్యోతి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 23 : ములుగు మున్సిపాలిటీలో పారిశుద్ధ కార్మికుడిగా పనిచేస్తున్న బోడ సాంబయ్య ఇటీవల వడదెబ్బతో మృతి చెందిన కుటుంబాని శనివారం బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్చార్జ్ బడే నాగజ్యోతి పరామర్శించి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేసి వారి కుటుంబాలకు అండగా ఉంటాం అన్నారు. ఈ సందర్భంగా బడే నాగజ్యోతి మాట్లాడుతూ మృతి చెందిన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. వడదెబ్బతో మృతి చెందిన బోడ సాంబయ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.4 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియాను అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు వేములపల్లి బిక్షపతి, ములుగు మండల పార్టీ మాజీ అధ్యక్షులు సనికొమ్ము రమేష్ రెడ్డి, ఆకుతోట చంద్రమొగిలి, కోళ్ళ వెంకన్న ములుగు మున్సిపాలిటీ కౌన్సిలర్లు బైకని సాగర్, బైకని ఓదెలు, మాజీ సర్పంచులు గండి కుమార్, ఈసం రామ్మూర్తి, కాకి పురుషోత్తం, మాజీ ఎంపీటీసీ అనుముల సురేష్, పోరిక శ్యామల నాయక్, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# నియామక పత్రాలను అందించిన జిల్లా కలెక్టర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 23 : ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కనెక్టింగ్ టాలెంట్ విత్ అపాచీ ఆపర్చునిటీస్‌ని ఈ నెల 8వ తేదీ ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాలోజీ కళాక్షేత్రంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వారు జాబ్ మేళా నిర్వహించరు. ఈ జాబ్ మేళాలో నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు. వారికి యాక్షన్ ప్లాన్ యూత్ వీక్ ఆఖరి రోజు అయినా శనివారం ప్లేస్మెంట్ ఆర్డర్స్ ను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఇండస్ట్రీస్ జిఎం అధికారులు, సంస్థ ప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్మిక కాలనీలలో జీఎం పాదయాత్ర



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 23 : గోదావరిఖని సింగరేణి కార్మిక కాలనీలలో నివసిస్తున్న కార్మిక కుటుంబాల స్థితిగతుల క్షేత్రస్థాయి పరిశీలన కోసం శనివారం అధికారులు పాదయాత్ర చేపట్టారు. ఈ మేరకు ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ కాలనీ, ఐబి కాలనీ, పవర్ హౌస్ కాలనీలలో పర్యటించారు. కార్మిక నివాస గృహాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్మిక కుటుంబ సభ్యులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కాలనీలలో భూగర్భ డ్రైనేజీ, త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం, రోడ్లు, పారిశుద్ధ్యం తదితర సమస్యలను కార్మిక కుటుంబాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జీఎం లలిత్ కుమార్, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మద్దె ఎల్లయ్యతో కలిసి మాట్లాడుతూ సింగరేణి సంస్థ కార్మికుల సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్మిక కాలనీలలో సౌకర్యాలు మెరుగుపరిచేందుకే పాదయాత్ర చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. పాదయాత్ర ద్వారా కార్మిక కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహనతో పరిష్కరించేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. ఈ పాదయాత్రలో జీఎంతో పాటు అన్ని విభాగాల సింగరేణి అధికారులు పాల్గొన్నారు.



# వీవోఏల నిరవధిక సమ్మె

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

లక్షెటిపేట, మే 23 : వివోఏలు గత కొన్ని రోజుల నుంచి పెండింగ్ లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం కావడంతో రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు శనివారం శాంతియుత నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వీవోఏ ఉద్యోగులు మాట్లాడుతు విఓఏలుగా దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించి, కనీస వేతనం రూ.26వేల కు పెంచేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ఏ వర్తించేలా చూడాలని, అర్హులైన వివోఏలకు సీసీలుగా పదోన్నతి కల్పించి భారత బీమా రూ.20 లక్షలు కల్పించాలన్నారు. 58 జీవోను సవరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విఓఏ ఉద్యోగులు నడిమెట్ల శారద, శేష, లచ్చన్న, అనిత, చెంద్రకళ, స్వర్ణ, రాజ్యలక్ష్మి, సంధ్యారాణి, రత్న, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# పాలీసెట్ ఫలితాల్లో శ్రీవిజ్ఞాన్ స్కూల్ ఘన విజయం

## - రాష్ట్ర స్థాయిలో టాప్-5 ప్రతిభతో విద్యార్థి కార్తీక్ సత్తా.


## - 120లో 116 మార్కులతో 164వ ర్యాంక్ సాధన



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 23 : మణుగూరు విద్యారంగంలో శ్రీవిజ్ఞాన్ స్కూల్ మరోసారి విశిష్ట ఫలితాలతో సత్తా చాటింది. 2026 తెలంగాణ పాలీసెట్ ఫలితాల్లో ఆ పాఠశాలకు చెందిన విద్యార్థి వాసం కార్తీక్ 120 మార్కులకు గాను 116 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో టాప్-5 ప్రతిభావంతుల్లో ఒకరిగా నిలిచాడు. అలాగే సమగ్ర రాష్ట్ర ర్యాంకింగ్లో 164వ ర్యాంక్ సాధించి మణుగూరు పట్టణానికి గర్వకారణంగా నిలిచాడు. విద్యార్థి సాధించిన ఈ ఘనతపై పట్టణ ప్రజలు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు. వరుస విజయాలతో ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు పొందిన శ్రీవిజ్ఞాన్ స్కూల్ పదో తరగతి ఫలితాలు, పోటీ పరీక్షల్లో ప్రతి ఏడాది విశేష ప్రతిభ కనబరుస్తూ ముందంజలో కొనసాగుతోంది. నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, ప్రత్యేక విద్యా ప్రణాళికలతో విద్యార్థులను రాష్ట్ర స్థాయి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నామని ఈ ఫలితాలు మరోసారి నిరూపించాయని పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రతినిధి సప్పిడి సాంబశివరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల విశ్వాసమే ఈ విజయాలకు బలమని అన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత ఫలితాలు సాధించి మణుగూరు ఖ్యాతిని రాష్ట్ర స్థాయిలో మరింత పెంచుతామని తెలిపారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థి కార్తీక్‌ను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ఘనంగా అభినందించారు.

# ఎండ దెబ్బతో పాల్వంచలో భవన నిర్మాణ కార్మికుడు మృతి




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 23 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కరకవాగు గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు పులి వెంకటేశ్వరరావు తీవ్ర ఎండ ప్రభావంతో మృతి చెందాడు. గ్రామంలోని 34వ వార్డు నివాసి అయిన వెంకటేశ్వరరావు శనివారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో ఎండదెబ్బకు గురై అస్వస్థతకు లోనయ్యాడు. అనంతరం తీవ్ర వాంతులు కావడంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఎండదెబ్బతో యువకుడు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, తల్లి ఉన్నారు. కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు.

# వడదెబ్బతో మృతి చెందిన హోం గార్డ్

## నివాళులు అర్పించిన పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), మే 23 : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న హోం గార్డ్ బి.శ్రీనివాస్ శుక్రవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. కాగా విషయం తెలుసుకున్న పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం.రవేష్‌తో కలిసి గోదావరిఖని శ్రీనగర్ కాలనీ (వినాయక్ నగర్)లోని మృతుడి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ 1996 సంవత్సరంలో హోంగార్డ్‌గా ఎంపికైన బుట్టి శ్రీనివాస్ గత 30 సంవత్సరాలుగా పోలీస్ శాఖలో నిబద్ధతతో, నిజాయితీతో ప్రజా సేవలో అహర్నిశలు శ్రమించారని తెలిపారు. ఆయన ఆకస్మిక మరణం పోలీస్ శాఖకు, కుటుంబ సభ్యులకు, సహచర సిబ్బందికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన సేవలను చిరస్థాయిగా స్మరించుకుంటామని, కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ తరఫున హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నామని అన్నారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం, ఓర్పు కలగాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నామని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నామని డీసీపీ తెలిపారు. పోలీస్ శాఖ తరఫున అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.10,000 చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. డీసీపీ వెంట గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, గోదావరిఖని 1 టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి, రామగుండం సీఐ కృష్ణ, హోంగార్డ్ ఆర్ఐ పెద్దన్న, ఎంటీవో మల్లేశం తదితర సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com